


Truth of News
RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్: మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 23 | బుధవారం 18 జూన్ 2025 | పేజీలు : 10 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

### అహ్మదాబాద్ దుర్ఘటన...

## 162 మృతదేహాలకు డీఎన్ఏ నిర్ధారణ

- ఈ నెల 12న అహ్మదాబాద్ లో ఘోర విమాన ప్రమాదం
- టేకాఫ్ తీసుకుంటూ కుప్పకూలిన ఎయిరిండియా విమానం
- 274 మంది మృతి
- మృతదేహాల గుర్తింపునకు డీఎన్ఏ పరీక్షలు నిర్వహిస్తున్న అధికారులు



2లో

## బరాక్ మగేన్...

- ఇరాన్ డ్రోన్లను అడ్డుకోవడానికి ఇజ్రాయెల్ 'మెరుపు కవచం'!
- ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య భీకర యుద్ధం
- పోటాపోటీగా ఆయుధ ప్రయోగం
- ఇజ్రాయెల్ ఐరన్ డోమ్‌ను ఛేదించిన ఇరాన్ మిస్సైళ్లు, డ్రోన్లు
- కొత్త రక్షణ వ్యవస్థను రంగంలోకి దింపిన ఇజ్రాయెల్
- 8 ఇరాన్ డ్రోన్ల కూల్చివేత

**న్యూఢిల్లీ-ఆంధ్రనాడు, జూన్ 17**

ఇరాన్‌తో ఉద్రిక్తతలు తారస్థాయికి చేరిన నేపథ్యంలో, ఇజ్రాయెల్ తన సరికొత్త, అత్యాధునిక నౌకాదళ గగనతల రక్షణ వ్యవస్థ 'బరాక్ మగేన్'ను తొలిసారిగా విజయవంతంగా పరీక్షించింది.

ఇరాన్ ప్రయోగించిన డ్రోన్లు, క్షిపణులు తమ ఐరన్ డోమ్ రక్షణ కవచాన్ని ఛేదించుకు రావడంతో, ఇజ్రాయెల్ ఈ నూతన వ్యవస్థను రంగంలోకి దించి తన రక్షణ సామర్థ్యాన్ని చాటుకుంది.



తొలిసారిగా రంగంలోకి... ఇరాన్ డ్రోన్ల కూల్చివేత

ఇజ్రాయెల్ నౌకాదళానికి చెందిన 'సార్ 6' తరగతి యుద్ధనౌక నుంచి ఈ వ్యవస్థను క్రియాశీలం చేశారు. ఆదివారం రాత్రి ఇరాన్ ప్రయోగించిన పలు డ్రోన్లను 'బరాక్ మగేన్' (హీబ్రూలో 'మెరుపు కవచం') విజయవంతంగా అడ్డగించి, గగనతలంలోనే కూల్చివేసినట్లు ఇజ్రాయెల్ సైనిక వర్గాలు (ఐడీఎఫ్) అధికారికంగా ధృవీకరించాయి. ఇది ఈ వ్యవస్థ యొక్క తొలి కార్యాచరణ వినియోగం కావడం, అదీ శత్రుదేశ దాడి సమయంలో కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఫాక్స్ న్యూస్ కథనం ప్రకారం, సుదూర గగనతల రక్షణ (ఎల్ఆర్ఏడీ) ఇంటర్‌సెప్టర్‌తో పాటు 'బరాక్ మగేన్' వ్యవస్థను ఉపయోగించి ఇజ్రాయెల్ 8 ఇరాన్ డ్రోన్లను నిర్వీర్యం చేసింది.

**'బరాక్ మగేన్' ప్రత్యేకతలు, సామర్థ్యం**

'బరాక్ మగేన్' అనేది 'బరాక్ ఎంఎక్స్' క్షిపణి రక్షణ వ్యవస్థ యొక్క నౌకాదళ ప్రత్యేక రూపం. డ్రోన్లు, క్రూయిజ్ క్షిపణులు, బాలిస్టిక్ క్షిపణుల వంటి వివిధ రకాల వైమానిక దాడుల నుంచి నౌకాదళ యుద్ధనౌకలకు సమగ్ర రక్షణ కల్పించేలా దీనిని రూపొందించారు. 'సార్ 6' కార్వెట్‌లపై మోహరించిన ఈ వ్యవస్థ, రాడార్, కమాండ్ వ్యవస్థలు, మరియు వివిధ శ్రేణుల క్షిపణులను ప్రయోగించగల స్మార్ట్ వర్టికల్ లాంచర్‌లతో పనిచేస్తుంది. దీనివల్ల 360-డిగ్రీల రక్షణ లభిస్తుంది. ఒకేసారి బహుళ లక్ష్యాలను ఛేదించే సామర్థ్యం దీని సొంతం. స్వల్ప (35 కి.మీ.),

- మిగతా 2లో..

### కుప్పం మహిళ శిరీషను

## ఫోన్‌లో సిఎం పరామర్శ

- రూ.5 లక్షల ఆర్థిక సాయం ప్రకటన.... పిల్లల చదువుకు హామీ
- అన్ని విధాలా అండగా ఉంటానని, ధైర్యంగా ఉండాలని సిఎం భరోసా



**అమరావతి-ఆంధ్రనాడు, జూన్ 17 :**

చిత్తూరు జిల్లా ,కుప్పం మండలం, నారాయణపురం గ్రామంలో అప్పు తీర్చలేదని చెట్టుకు కట్టేసి అమానుషంగా వ్యవహరించిన ఘటనలో బాధితురాలు శిరీషతో సిఎం చంద్రబాబు నాయుడు మాట్లాడారు. ఫోన్‌లో మాట్లాడి శిరీషను పరామర్శించి, ఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. గతంలో ఎప్పుడైనా వారి నుంచి వేధింపులు ఎదురయ్యాయా అని అడిగారు. పలు సందర్భాల్లో తమను ఇబ్బందిపెట్టారని ఆమె చెప్పారు. ఈ ఘటనలో పిల్లలు, తాను భయపడుతున్నామని ముఖ్యమంత్రికి బాధితురాలు గోడు వెళ్లబోసుకుంది. ఇటువంటి ఘటన దురదృష్టకరమని, ఇలాంటి వాటిని సహించే ప్రసక్తే లేదని సిఎం స్పష్టం చేశారు. మానవత్వం లేకుండా

- మిగతా 2లో..

## ఏడాదిలోనే మెరుగైన ఫలితాలు...

- ఇది మంచి పరిణామం
- ప్రణాళిక శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష
- రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, జీఎస్డీపీ అంచనాలు, అభివృద్ధి సూచికలు, గ్రోత్ డ్రైవర్స్ పై చర్చ
- వివిధ అంశాలపై ముఖ్యమంత్రి దిశా నిర్దేశం

**అమరావతి-సూర్యవాస్తవం, జూన్ 17**

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మెరుగయ్యేలా అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. మంగళవారం నాడు రాష్ట్ర సచివాలయంలో ప్రణాళిక శాఖపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, జీఎస్డీపీ అంచనాలు, అభివృద్ధి సూచికలు, గ్రోత్ డ్రైవర్స్ వంటి అంశాలపై



చంద్రబాబు అధికారులతో చర్చించారు. ఈ సమీక్షలో ప్రణాళిక శాఖ దృష్టి సారించాల్సిన వివిధ అంశాలపై ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేశారు. సంక్షేమానికి వనరులు లభ్యత పెరిగేలా ప్రణాళికలు రూపొందించాలని, ఆర్థిక సుస్థిరత కోసం సేవల రంగంపై దృష్టి పెట్టాలని సూచించారు. ప్రభుత్వ కార్యక్రమాలు, సేవలపై విభిన్న మార్గాల్లో ప్రజాభిప్రాయ సేకరణ జరపాలని అన్నారు. తలసరి ఆదాయంలో ఏడాదిలోనే మెరుగైన ఫలితాలు మంచి పరిణామం అని చంద్రబాబు సంతోషం వ్యక్తం చేశారు. ప్రభుత్వ శాఖలకు మార్గ నిర్దేశం

- మిగతా 2లో..



### జగన్ సహా

## 100 మందికే అనుమతి - పల్నాడు జిల్లా ఎస్పీ

- పల్నాడు జిల్లా రెంటపాలలో వైసీపీ కార్యకర్త విగ్రహావిష్కరణ
- కార్యక్రమానికి హాజరుకానున్న జగన్
- 30 వేల మంది వస్తారని వైసీపీ శ్రేణుల అంచనా

2లో

## పోలీసుల అదుపులో చెవిరెడ్డి

- బెంగళూరు విమానాశ్రయంలో అదుపులోకి తీసుకున్న పోలీసులు
- మద్యం ముడుపుల కేసులో లుక్ అవుట్ నోటీసు జారీ
- అర్ధరాత్రికి చేరుకోనున్న ఏపీ పోలీసులు, సిట్ అధికారులు

**తిరుపతి రూరల్ -సూర్యవాస్తవం, జూన్ 17 :**

చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని బెంగుళూరు విమానాశ్రయ అధికారులు, పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మద్యం ముడుపుల కేసుతో లింక్ ఉన్న కారణంగా చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిపై లుక్ అవుట్ నోటీసును అన్ని విమానాశ్రయ అధికారులకు జారీ చేశారు. సిట్ అధికారుల విచారణ పూర్తయ్యేంత వరకు ఆయన దేశం విడిచి వెళ్లరాదన్న నిబందనను అందులో తెలియపరచి లుక్ అవుట్ నోటీసులు ఇచ్చారు. ఆ విషయం తెలియని చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తన వ్యాపార పనుల నిమిత్తం విదేశాలకు పయనమవడంతో విమానాశ్రయంలో ఇమ్మిగ్రేషన్ అధికారులు మంగళవారం ఆపేశారు. అనంతరం ఏపీ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో విజయవాడ నుంచి బయలుదేరిన పోలీసులు అర్ధరాత్రికి బెంగుళూరు విమానాశ్రయం చేరుకోనున్నారు. అనంతరం చెవిరెడ్డికి సిట్ అధికారులు నోటీసులు ఇచ్చి వదిలేస్తారా..? విచారణ కోసం తీసుకవెళతారా..? అన్న సందిగ్ధం నెలకొంది. గత



2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో తెలంగాణ - ఆంధ్ర సరిహద్దులోని జగ్గయ్యపేట టోల్‌గేట్ వద్ద చెవిరెడ్డి వ్యక్తిగత సహాయకుడి కారులో 8.2 కోట్ల రూపాయల నగదు పట్టు బడిన విషయం తెలిసిందే. ఆ నగదు మద్యం ముడుపుల కింద హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు తరలిస్తున్నట్టుగా అనుమానించిన పోలీసులు చెవిరెడ్డి

- మిగతా 2లో..



## షర్మిల ఫోన్ ట్యాప్!

- వైసీపీ హయాంలో షర్మిల ఫోన్లు ట్యాప్ అయినట్లు గుర్తింపు
- కోడ్ భాష వాడి సంభాషణలు రికార్డ్ చేశారని ఆరోపణ
- వివరాలు ఎప్పటికప్పుడు జగన్‌కు చేరవేశారని సమాచారం

2లో

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

# బరాక్ మగేన్...

(మొదటిపేజీ తరువాయి)

మధ్య (70 కి.మీ.), దీర్ఘ శ్రేణి (150 కి.మీ. వరకు) ఇంటర్‌సెప్టర్‌లను ఇది ప్రయోగించగలదు.

**భారత్ భాగస్వామ్యంతో 'బరాక్' వ్యవస్థ**

గమనించాల్సిన విషయం ఏమిటంటే, ఈ 'బరాక్' రక్షణ వ్యవస్థకు మూలాలు భారత్‌తో ముడిపడి ఉన్నాయి. ఇజ్రాయెల్, భారత్ సంయుక్తంగా అభివృద్ధి చేసిన 'బరాక్-8' వ్యవస్థ ఆధారంగానే 'బరాక్ మగేన్'ను మరింత ఆధునీకరించి, నౌకాదళ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దారు. భారత డీఆర్‌డీఓ భాగస్వామ్యంతో తయారైన బరాక్-8, భూమి మరియు సముద్ర ఆధారిత వేదికల నుంచి ప్రయోగించగలిగే సామర్థ్యం కలిగి, వివిధ రకాల వైమానిక ముప్పుల నుంచి రక్షణ కల్పిస్తుంది. ఈ విజయవంతమైన ప్రయోగంతో ఇజ్రాయెల్ నౌకాదళ రక్షణ సామర్థ్యం గణనీయంగా పెరిగిందని, దేశ బహుళస్థాయి వాయు రక్షణ వ్యూహంలో ఇది ఒక కీలకమైన అదనపు పొరగా నిలుస్తుందని రక్షణ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

### అహ్మదాబాద్ దుర్ఘటన...

# 162 మృతదేహాలకు డీఎన్ఏ నిర్ధారణ

- ఈ నెల 12న అహ్మదాబాద్ లో ఘోర విమాన ప్రమాదం
- టేకాఫ్ తీసుకుంటూ కుప్పకూలిన ఎయిరిండియా విమానం
- 274 మంది మృతి
- మృతదేహాల గుర్తింపునకు డీఎన్ఏ పరీక్షలు నిర్వహిస్తున్న అధికారులు

**గుజరాత్- ఆంధ్రనాడు, జూన్ 17**

గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంలో మరణించిన వారిలో 162 మంది డీఎన్ఏ నమూనాలు వారి కుటుంబ సభ్యులతో సరిపోలినట్లు అధికారులు మంగళవారం నాడు ధృవీకరించారు. ఇప్పటివరకు 120 మంది మృతదేహాలను వారి ఆత్మీయులకు అప్పగించినట్లు వారు తెలిపారు. ఈ ఘటన యావత్ దేశాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది.

జూన్ 12న సర్దార్ వల్లభాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి టేకాఫ్ అయిన కొద్ది నిమిషాలకే లండన్ వెళుతున్న బోయింగ్ 787-8 డ్రీమ్‌లైనర్ విమానం సమీపంలోని ఒక హాస్టల్ కాంప్లెక్స్‌పై కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీతో సహా 241 మంది ప్రయాణికులు, సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. విమానంలో మొత్తం 242 మంది ఉండగా, విశ్వాస్ అనే ఒకే ఒక ప్రయాణికుడు ప్రాణాలతో బయటపడ్డారు.

ఈ ప్రమాదంలో బీజే మెడికల్ కాలేజీకి చెందిన నలుగురు విద్యార్థులు కూడా మరణించారని, ఆ సంఖ్యలో ఎటువంటి మార్పు లేదని అహ్మదాబాద్ సివిల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ రాకేష్ జోషి ధృవీకరించారు. ప్రాణాలతో బయటపడిన విశ్వాస్ ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉందని, ఆయన నెమ్మదిగా కోలుకుంటున్నారని జోషి తెలిపారు.

మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ అంత్యక్రియలు సోమవారం రాజ్‌కోట్‌లో పూర్తి ప్రభుత్వ లాంఛనాలతో జరిగాయి. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్, ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ వంటి ప్రముఖ రాజకీయ నాయకుల సమక్షంలో ఆయన కుమారుడు రుషభ్ రూపానీ అంతిమ సంస్కారాలు నిర్వహించారు. మిగిలిన మృతదేహాల గుర్తింపు ప్రక్రియ, వాటిని కుటుంబ సభ్యులకు అప్పగించే కార్యక్రమం కొనసాగుతోందని అధికారులు తెలిపారు.

### కుప్పం మహిళ శిరీషను

# ఫోన్‌లో సిఎం పరామర్శ

(మొదటిపేజీ తరువాయి)

ప్రవర్తించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఇప్పటికే అధికారులకు ఆదేశాలు ఇచ్చానని సిఎం అన్నారు. శిరీష పిల్లలు ఏం చదువుతున్నారో అడిగి తెలుసుకున్నారు. వారిని బాగా చదివించాని సూచించారు. ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా అండగా ఉంటానని....ధైర్యంగా ఉండాలని భరోసానిచ్చారు. అప్పుల బాధ, ఆర్థిక ఇబ్బందులతో బిడ్డలను చదివించుకోవడానికి ఇబ్బంది పడుతున్న శిరీష పరిస్థితిని తెలుసుకున్న ముఖ్యమంత్రి...అప్పటికప్పుడు ఆమెకు రూ.5 లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. ముగ్గురు పిల్లల చదువు బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని శిరీషకు ఫోన్‌లో సిఎం హామీ ఇచ్చారు. ఘటన, తదనంతర పరిణామాలపై తనకు నివేదిక ఇవ్వాలని, బాధిత కుటుంబానికి అందుబాటులో ఉండి అవసరమైన సాయం పూర్తిగా అందేలా చూడాలని సియం అధికారులను ఆదేశించారు.

# పోలీసుల అదుపులో చెవిరెడ్డి

(మొదటిపేజీ తరువాయి)

మేనేజర్లు, గన్‌మెన్లలను సిట్ అధికారులు ఇప్పటికే అదుపులోకి తీసుకుని విచారించారు. ఇప్పటికే చెవిరెడ్డి గన్‌మెన్లు, వ్యక్తిగత సిబ్బంది నుంచి స్టేట్మెంట్లు రికార్డు చేశారు. అయితే అందులోని ఒకరు హైకోర్టులో ఫిర్యాదు చేస్తూ, బలవంతంగా స్టేట్‌మెంట్ రాసించారని, చెవిరెడ్డి పాత్రను తప్పుడు వంకతో ఒప్పించమన్నారని ఆరోపించారు. ఇక ఈ కేసులో ఇప్పటికే కేసిరెడ్డి రాజశేఖరెడ్డి గ్యాంగ్ సభ్యులు, మాజీ సీఎం జగన్ సెక్రటరీ ధనుంజయ్ రెడ్డి, ఓఎస్డీ కృష్ణమోహన్ రెడ్డి, భారతీ సిమెంట్స్ డైరెక్టర్ బాలాజీ గోవిందప్పలను సిట్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు.

తాజాగా మద్యం ముడుపుల కేసులో రాజకీయంగా కీలకమైన నాయకుడైన, జగన్ కుటుంబానికి అత్యంత సన్నిహితుడిగా ఉన్న చెవిరెడ్డిని సిట్ అదుపులోకి తీసుకోవడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది.

# ఏడాదిలోనే మెరుగైన ఫలితాలు...

(మొదటిపేజీ తరువాయి)

చేయడంలో ప్రణాళిక విభాగం కీలక పాత్ర పోషించాలని అభిప్రాయపడ్డారు.

గతానికంటే ఎక్కువగా ప్రణాళిక శాఖకు తాను ప్రాధాన్యమిస్తున్నట్టు చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రతి శాఖ మెరుగైన ఫలితాలు సాధించేలా ప్రణాళిక శాఖే బాధ్యత తీసుకోవాలన్నారు. రుణ భారం తగ్గించుకోవడం, సంక్షేమానికి వనరులు సమకూర్చుకోవడం వంటివి అత్యంత కీలక అంశాలని చంద్రబాబు వివరించారు. వనరుల సమీకరణలో రాష్ట్ర సొంత ఆదాయం, కేంద్రం నుంచి వచ్చే నిధులతో పాటు కొత్త మార్గాలను అన్వేషించాలని సూచించారు. పెట్టుబడులను ఆకర్షించే విషయంలో ఏపీ బ్రాండ్ ప్రమోషన్ నిరంతరం జరగాలని స్పష్టం చేశారు. ఇప్పటికే 25 కెబినెట్ సమావేశాలు, 6 ఎస్ఐబీపీ సమావేశాలు నిర్వహించి.. పెద్ద ఎత్తున పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చామని గుర్తు చేశారు. ఇక్కడితో ఆగకుండా.. ఆ ప్రాజెక్టులు కార్యరూపం దాల్చేలా చూస్తున్నామన్నారు.

**సాంకేతికతతో సమాచార విశ్లేషణ**

కచ్చితమైన ప్రణాళికలతో రాష్ట్ర సమగ్రాభివృద్ధికి పని చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో తలసరి ఆదాయం లెక్కల్లో జాతీయ స్థాయికి మించి ఏపీ పురోగతిని సాధించిందని అన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి జాతీయ స్థాయిలో తలసరి ఆదాయం 8.7 శాతం మేర పెరిగితే.. ఏపీ 11.89 శాతం మేర పురోగతి నమోదు చేసిందని అధికారులు వెల్లడించారు. రాష్ట్రం ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించేందుకు అవసరమైన డేటా అనలిటిక్స్ కోసం టెక్నాలజీని వినియోగించుకోవాలన్నారు.

రాష్ట్ర, జిల్లా, మండలాలతో పాటు గ్రామ స్థాయిలో కూడా కీ-పెర్ఫామెన్స్ ఇండికేటర్లు పెడితే.. క్షేత్ర స్థాయి నుంచి పోటీతత్వం పెరుగుతుందన్నారు. 2028-29 నాటికి 15 శాతం వృద్ధి లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

**అభివృద్ధి సూచికలే కీలకం**

నెలవారీ అభివృద్ధి సూచికల ద్వారా ఎప్పటికప్పుడు పనితీరును సమీక్షించుకునే అవకాశం ఉంటుందని సీఎం చంద్రబాబు సూచించారు. దీని వల్ల ఎప్పుడైనా లోటుపాట్లు ఉంటే తక్షణం సవరించుకునే అవకాశం ఉంటుందన్నారు. రిజర్వాయర్లు, నేలలో తేమ శాతం, భూగర్భ జలాల వివరాలు వంటివి నమోదు చేసి వివరాలు తీసుకునే బాధ్యతను ప్రణాళిక శాఖ తీసుకోవాలన్నారు. వ్యవసాయం, ఉద్యాన పంటల్లో గ్రాస్ వాల్యూ ఎడిషన్ తో పాటు సేవల రంగంలో పెట్టుబడులు పెరిగేలా కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. విద్యుత్ కొనుగోలు ధరలు తగ్గించేందుకు ఎలాంటి ప్రత్యామ్నాయాలు ఉన్నాయనే అంశాన్ని పరిశీలించాలని సీఎం చంద్రబాబు సూచించారు. పీ-4లో బంగారు కుటుంబాలు-మార్గదర్శుల మధ్య సమన్వయం చేసుకునే ప్రక్రియను ఆగస్టు 15వ తేదీలోగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

**మెరుగ్గా ప్రజాభిప్రాయ సేకరణ**

ప్రభుత్వ సేవలు, విభాగాల పనితీరు మీద నిరంతరం ప్రజాభిప్రాయం తీసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. క్షేత్ర స్థాయిలో పరిస్థితులు ప్రభుత్వానికి చేరేలా పీపుల్ పాజిటివ్ పర్సెప్షన్ వ్యవస్థను తీర్చిదిద్దాలన్నారు.

ఐవీఆర్ఎస్ కాల్స్, క్యూఆర్ కోడ్ విధానాల ద్వారా ప్రస్తుతం చేపడుతున్న అభిప్రాయ సేకరణతోపాటు.. మరిన్ని భిన్నమైన మార్గాల ద్వారా కచ్చితమైన సమాచారం రాబట్టేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ సహా ప్రణాళిక శాఖకు చెందిన ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# అక్టోబరు 2 నాటికి ఏపీలో ప్లాస్టిక్ రహిత నగరాలు

- రాష్ట్రంలో ప్లాస్టిక్ నిర్మూలనకు సీఎం చంద్రబాబు శ్రీకారం
- నాలుగు ప్రధాన నగరాలతో పాటు 17 కార్పొరేషన్లలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం
- రెండు నెలల్లో సర్క్యులర్ ఎకానమీ తుది పాలసీ రూపకల్పన
- ఏడాదిలోగా మూడు ప్రాంతాల్లో సర్క్యులర్ ఎకానమీ పార్కుల ఏర్పాటు
- వ్యర్థాల నిర్వహణలో ఉత్తమ ప్రతిభకు 'స్వచ్ఛత' అవార్డులు

**అమరావతి-సూర్యవాస్తవం, జూన్ 17**

రాష్ట్రంలో పర్యావరణ పరిరక్షణ, ప్రజారోగ్యం దిశగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ముఖ్యంగా నగరాలను ప్లాస్టిక్ రహితంగా మార్చేందుకు గట్టి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ ఏడాది అక్టోబర్ 2వ తేదీ నాటికి విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, రాజమండ్రి నగరాలతో పాటు మరో 17 కార్పొరేషన్లలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలని స్పష్టం చేశారు. ప్లాస్టిక్ సంచులకు బదులుగా గుడ్డ సంచుల వినియోగాన్ని విరివిగా ప్రోత్సహించాలని సూచించారు.

**ప్లాస్టిక్ నిర్మూలనకు పటిష్ట చర్యలు**

మంగళవారం సచివాలయంలో సర్క్యులర్ ఎకానమీపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి ఈ ఆదేశాలు జారీ చేశారు. ప్లాస్టిక్ వ్యర్థాల సమస్యను అధిగమించేందుకు 87 పట్టణ ప్రాంతాల్లో 157 రెడ్యూస్-రీయూజ్-రీసైకిల్ (ఆర్ఆర్ఆర్) కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్దేశించారు. రాష్ట్రంలో పేరుకుపోయిన చెత్తను తక్షణమే తొలగించాలని, రీసైక్లింగ్ మరియు చెత్తను వేరు చేయడంపై 90 రోజుల్లోగా సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సమర్పించాలని ఆదేశించారు.

**స్వచ్ఛత అవార్డులతో ప్రోత్సాహం**

వ్యర్థాల నిర్వహణలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన వారికి ప్రోత్సాహకంగా వచ్చే ఏడాది అక్టోబర్ 2 నుంచి 'స్వచ్ఛత' అవార్డులను అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. స్థానిక సంస్థలు, స్వయం సహాయక సంఘాలు, అంగన్‌వాడీలు, పాఠశాలలు-కళాశాలలు, బస్టాండ్లు, ఆసుపత్రులు, ఎన్జీవోలు, వివిధ సంస్థల వారీగా ఈ అవార్డులను అందజేయాలని నిర్దేశించారు.

**సర్క్యులర్ ఎకానమీకి పెద్దపీట**

రాష్ట్రంలో వ్యర్థాల నిర్వహణ వ్యవస్థను బలోపేతం చేసేందుకు, వ్యర్థాల నుంచి సంపద సృష్టించే లక్ష్యంతో రెండు నెలల్లోగా సర్క్యులర్ ఎకానమీకి సంబంధించిన తుది పాలసీని తీసుకురావాలని ముఖ్యమంత్రి అధికారులకు స్పష్టం చేశారు. ఇందులో భాగంగా, ఏడాదిలోగా రాష్ట్రంలోని మూడు ప్రాంతాల్లో సర్క్యులర్ ఎకానమీ పార్కులను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. మొదటి దశలో విశాఖపట్నంలో 400 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్న పార్కును అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించాలని, ఇందుకుగాను వివిధ దేశాల్లోని విజయవంతమైన పార్కులను అధ్యయనం చేయాలని సూచించారు. ఈ పార్కుల ద్వారా రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు ఆకర్షించేలా చూడాలన్నారు. వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లలో ఆధునిక యంత్రాల వినియోగాన్ని పెంచాలని కూడా ఆయన దిశానిర్దేశం చేశారు. 'మెటీరియల్ రీసైక్లింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా' సమర్పించిన 'సర్క్యులర్ ఎకానమీ పార్కుల' ఏర్పాటు ప్రతిపాదనలను కూడా సీఎం పరిశీలించారు.

**11 కీలక రంగాలు, 3 శాఖలపై ప్రత్యేక దృష్టి**

సర్క్యులర్ ఎకానమీ కింద కేంద్ర ప్రభుత్వం గుర్తించిన మున్సిపల్, వాహనాలు, లిథియం బ్యాటరీలు, జిప్సం, టైర్లు, రబ్బర్, ఎలక్ట్రానిక్, వ్యవసాయం, పారిశ్రామిక, ఆక్వా వ్యర్థాలు వంటి 11 రంగాలపై ప్రధానంగా దృష్టి సారించాలని ముఖ్యమంత్రి సూచించారు. వీటికి అదనంగా గనులు, చేనేత, పశుసంవర్ధక శాఖలను కూడా కలుపుకుని సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. నగర పాలక సంస్థలు, పంచాయతీల్లో జీరో వేస్ట్ లక్ష్యాన్ని సాధించేందుకు కృషి చేయాలన్నారు.

## అహ్మదాబాద్ దుర్ఘటన 162 మృతదేహాలకు డీఎన్ఏ నిర్ధారణ

- ఈ నెల 12న అహ్మదాబాద్ లో ఘోర విమాన ప్రమాదం
- టేకాఫ్ తీసుకుంటూ కుప్పకూలిన ఎయిరిండియా విమానం
- 274 మంది మృతి - మృతదేహాల గుర్తింపునకు డీఎన్ఏ పరీక్షలు నిర్వహిస్తున్న అధికారులు

**గుజరాత్-సూర్యవాస్తవం, జూన్ 17**

గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంలో మరణించిన వారిలో 162 మంది డీఎన్ఏ నమూనాలు వారి కుటుంబ సభ్యులతో సరిపోలినట్లు అధికారులు మంగళవారం నాడు ధృవీకరించారు. ఇప్పటివరకు 120 మంది మృతదేహాలను వారి ఆత్మీయులకు అప్పగించినట్లు వారు తెలిపారు. ఈ ఘటన యావత్ దేశాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది.జూన్ 12న సర్దార్ వల్లభాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి టేకాఫ్ అయిన కొద్ది నిమిషాలకే లండన్ వెళుతున్న బోయింగ్ 787-8 డ్రీమ్‌లైనర్ విమానం సమీపంలోని ఒక హాస్టల్ కాంప్లెక్స్‌పై కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీతో సహా 241 మంది ప్రయాణికులు, సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. విమానంలో మొత్తం 242 మంది ఉండగా, విశ్వాస్ అనే ఒకే ఒక ప్రయాణికుడు ప్రాణాలతో బయటపడ్డారు.ఈ ప్రమాదంలో బీజే మెడికల్ కాలేజీకి చెందిన నలుగురు విద్యార్థులు కూడా మరణించారని, ఆ సంఖ్యలో ఎటువంటి మార్పు లేదని అహ్మదాబాద్ సివిల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ రాకేష్ జోషి ధృవీకరించారు. ప్రాణాలతో బయటపడిన విశ్వాస్ ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉందని, ఆయన నెమ్మదిగా కోలుకుంటున్నారని జోషి తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ అంత్యక్రియలు సోమవారం రాజ్‌కోట్‌లో పూర్తి ప్రభుత్వ లాంఛనాలతో జరిగాయి. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్, ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ వంటి ప్రముఖ రాజకీయ నాయకుల సమక్షంలో ఆయన కుమారుడు రుషభ్ రూపానీ అంతిమ సంస్కారాలు నిర్వహించారు. మిగిలిన మృతదేహాల గుర్తింపు ప్రక్రియ, వాటిని కుటుంబ సభ్యులకు అప్పగించే కార్యక్రమం కొనసాగుతోందని అధికారులు తెలిపారు.

## జగన్ సహా 100 మందికే అనుమతి - పల్నాడు జిల్లా ఎస్పీ

- పల్నాడు జిల్లా రెంటపాలలో రేపు వైసీపీ కార్యకర్త విగ్రహావిష్కరణ
- కార్యక్రమానికి హాజరుకానున్న జగన్
- 30 వేల మంది వస్తారని వైసీపీ శ్రేణుల అంచనా

**అమరావతి-ఆంధ్రనాడు, జూన్ 17**

పల్నాడు జిల్లా సత్తెనపల్లి రూరల్ మండలం రెంటపాల గ్రామంలో రేపు జరగనున్న వైసీపీ కార్యకర్త నాగ మల్లేశ్వరరావు విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఆ పార్టీ అధినేత జగన్ హాజరుకానున్నారు. అయితే, ఈ కార్యక్రమానికి భద్రతా కారణాల దృష్ట్యా జగన్ తో సహా కేవలం వంద మందికి మాత్రమే అనుమతి ఇస్తున్నట్లు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు వెల్లడించారు.జగన్ పర్యటనకు అనుమతి కోరుతూ సత్తెనపల్లి వైసీపీ ఇన్‌చార్జి సుధీర్ భార్గవ్ రెడ్డి పోలీసులకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ అభ్యర్థనను పరిశీలించిన అనంతరం ఎస్పీ కంచి శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడుతూ... విగ్రహావిష్కరణ కార్యక్రమానికి సుమారు 30 వేల మంది ప్రజలు హాజరవుతారని వైసీపీ వర్గాలు అంచనా వేస్తున్నాయని ఎస్పీ పేర్కొన్నారు.అయితే, విగ్రహావిష్కరణ జరిగే ప్రదేశానికి కేవలం పది అడుగుల వెడల్పు ఉన్న దారి మాత్రమే ఉందని, ఆ దారికి ఇరువైపులా నివాస గృహాలు ఉన్నాయని ఎస్పీ వివరించారు. ఈ కారణంగా, ఆ ప్రాంతంలో వంద మంది కంటే ఎక్కువ మంది గుమిగూడటానికి అవకాశం లేదని ఆయన స్పష్టం చేశారు.

గతంలో రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి కార్యక్రమాల్లో జరిగిన కొన్ని అవాంఛనీయ సంఘటనలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. మాజీ సీఎం జగన్ కాన్వాయ్‌తో పాటు అదనంగా మరో మూడు వాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుందని ఎస్పీ చెప్పారు. శాస్త్రీయమైన అంచనాల ప్రకారమే అనుమతులు మంజూరు చేస్తున్నామని, ఒకవేళ నిర్దేశించిన నిబంధనలను ఎవరైనా ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఈ సందర్భంగా హెచ్చరించారు. భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకే తాము ప్రాధాన్యత ఇస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.

# షర్మిల ఫోన్ ట్యాప్

- వైసీపీ హయాంలో షర్మిల ఫోన్లు ట్యాప్ అయినట్లు గుర్తింపు
- కోడ్ భాష వాడి సంభాషణలు రికార్డ్ చేశారని ఆరోపణ
- వివరాలు ఎప్పటికప్పుడు జగన్‌కు చేరవేశారని సమాచారం

**అమరావతి-ఆంధ్రనాడు, జూన్ 17**

తెలంగాణలో ప్రకంపనలు సృష్టిస్తున్న ఫోన్ ట్యాపింగ్ కేసులో రోజుకో కొత్త విషయం వెలుగులోకి వస్తోంది. పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ ప్రముఖుల ఫోన్లు ట్యాపింగ్‌కు గురైనట్లు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఇప్పటికే గుర్తించిన విషయం తెలిసిందే. తాజాగా ఈ జాబితాలో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పేరు కూడా చేరినట్లు తెలుస్తోంది. ఏపీలో వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో షర్మిల మొబైల్ ఫోన్లను అత్యంత రహస్యంగా ట్యాప్ చేసినట్లు సమాచారం. ఇందుకోసం ప్రత్యేకంగా కోడ్ భాషను కూడా ఉపయోగించినట్లు తెలుస్తోంది. షర్మిల వాయిస్ సంభాషణలను రికార్డు చేయడమే కాకుండా, ఆమె ఎవరెవరితో మాట్లాడుతున్నారనే వివరాలను ఎప్పటికప్పుడు ఆమె సోదరుడి (జగన్)కి చేరవేసినట్లు ఆరోపణలు న్నాయి. షర్మిల ఎవరితో సంప్రదింపులు జరుపుతున్నారనే దానిపై నిశితంగా నిఘా పెట్టినట్లు కూడా వార్తలు వస్తున్నాయి. అంతే కాకుండా, షర్మిలకు సన్నిహితంగా ఉండే కొందరిని ఓ సీనియర్ పోలీస్ అధికారి పిలిపించి హెచ్చరించినట్లు కూడా గుర్తించారు. తన ఫోన్లు ట్యాప్ అవుతున్నాయన్న విషయాన్ని షర్మిల అప్పట్లోనే పసిగట్టినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై ఆమె వద్ద కీలక ఆధారాలు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ అంశానికి సంబంధించి పూర్తి వివరాలు వెల్లడికావాల్సి ఉంది.

## సంపాదకీయం

# టర్కీ కాస్కో....మోడీ దెబ్బ



భారత ప్రధాని నరేంద్ర మోదీ కేవలం 10 లక్షలోపు జనాభా ఉన్న చిన్న ద్వీప దేశమైన సైప్రస్‌లో పర్యటిస్తున్నారు. తద్వారా టర్కీకి గట్టి సందేశం పంపించారు. టర్కీ, సైప్రస్ మధ్య దశాబ్దాలుగా వైరం ఉండగా.. సైప్రస్‌కు అండగా నిలవడం వ్యూహాత్మకంగా, ఆర్థికంగా భారత్‌కు ప్రయోజనకరం. మధ్యధరా సముద్రంలో మన ప్రాబల్యాన్ని పెంచుకోవడానికి.. యూరోపియన్ యూనియన్‌తో సంబంధాలను బలోపేతం చేసుకోవడానికి సైప్రస్‌తో స్నేహం ఉపయోగపడుతుంది. ఇది భారతదేశానికి ఒక ముఖ్యమైన భాగస్వామిగా మారుతుంది. భారత ప్రధాని నరేంద్ర మోదీ సైప్రస్ అనే ఓ చిన్న దేశంలో పర్యటిస్తున్నారు. ఇందుకు సంబంధించిన వీడియోను మోదీ ఎక్స్ ద్వారా ప్రజలతో పంచుకున్నారు. మధ్యదరా సముద్రంలో చిన్న ద్వీప దేశమైన సైప్రస్ గురించి మనలో చాలా మందికి తెలియదు. ఆ మాటకొస్తే మన దేశాధినేతలు కూడా సైప్రస్‌కు అంతగా ప్రాధాన్యం ఇవ్వలేదు. కానీ ప్రపంచ శక్తిగా ఎదిగే క్రమంలో భారత్.. తనతో కలిసి వచ్చే ప్రతి దేశాన్నీ కలుపుకొని పోతోంది. అయితే సైప్రస్‌తో దోస్తీ మాత్రం అంతకు మించిన కొత్త సమీకరణలకు తెరతీయనుంది. ఎందుకంటే తుర్కియే గుర్తుంది కదా, అదేనండీ టర్కీ . గతంలో టర్కీని భారీ భూకంపం వణికించినప్పుడు 'ఆపరేషన్ దోస్త్'తో భారత్ అండగా నిలిచింది. కానీ ఆపరేషన్ సింధూర్ సమయంలో టర్కీ పాకిస్థాన్‌కు మద్దతు ప్రకటించడంతోపాటు.. మనపై దాడులకు డ్రోన్లను సైతం ఇస్లామాబాద్‌కు అందించింది. ఇప్పుడు టర్కీకి ఓ బలమైన సందేశం ఇవ్వడం కోసం ప్రధాని మోదీ సైప్రస్‌లో పర్యటిస్తున్నారు. సైప్రస్ పర్యటనకు వెళ్తే.. టర్కీకి మెసేజ్ ఎలా ఇస్తారని అనుకుంటున్నారా..? అక్కడికే వస్తున్నాం..టర్కీ, సైప్రస్ రెండింటి మధ్య వైరం ఉంది. 1974లో సైప్రస్ మీద దాడి చేసిన టర్కీ.. ఆ దేశంలో మూడో వంతు భూభాగాన్ని ఆక్రమించుకుంది. అదిగో అప్పటి నుంచి టర్కీ అంటే సైప్రస్‌కు ఏమాత్రం గిట్టదు. అలాంటి సైప్రస్‌కు ప్రధాని మోదీ వెళ్లడం, అది కూడా ఆపరేషన్ సింధూర్ తర్వాత చేపట్టిన తొలి విదేశీ పర్యటన ఇదే కావడం అంటే.. నా శత్రువుతో నువ్వు చెలిమి చేస్తే.. నీ శత్రువుతో నేను దోస్తీ చేస్తానని టర్కీకి బలంగా సంకేతాలు ఇచ్చినట్టే కదా. టర్కీ గనుక తన జోలికొస్తే.. భారత్ తనకు అండగా ఉంటుందనే భరోసా సైప్రస్‌కు దక్కినట్టే.ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక శక్తిగా, అత్యంత శక్తివంతమైన సైనిక శక్తుల్లో ఒకటిగా ఎదుగుతోన్న భారత్‌తో స్నేహం అనేది సైప్రస్‌కు కొండంత అండ అని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. భారత్‌తో మరింత సంబంధాలను మరింత బలోపేతం చేసుకునే ఉద్దేశంతో ఉన్న సైప్రస్.. ప్రధాని మోదీని తమ దేశ అత్యున్నత పౌర పురస్కారమైన 'ది గ్రాండ్ క్రాస్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ మకరియోస్ ఎఎఎ'తో సత్కరించి గౌరవించింది.సైప్రస్‌కు మన మద్దతు దొరుకుతుంది. టర్కీ మీద కోపంతో ఆ దేశానికి మద్దతు ఇవ్వడం వల్ల మనకు వచ్చే లాభం ఏంటి అనుకుంటున్నారా? వ్యూహాత్మకంగా, దౌత్యపరంగా, భౌగోళిక రాజకీయ పరంగానే కాకుండా ఆర్థికంగానూ సైప్రస్‌తో దోస్తీ భారత్‌కు ప్రయోజనకరం కానుంది.టర్కీ, సిరియాలకు దగ్గరగా ఉండే సైప్రస్ భౌగోళికంగా ఆసియాలో ఉన్నట్టుగా ఉంటుంది. కానీ ఆ దేశానికి యూరోపియన్ యూనియన్ (ఈయూ)లో సభ్యత్వం ఉంది. పశ్చిమ దేశాలతో దానికి మంచి సంబంధాలే ఉన్నాయి. అంతే కాదు 2026లో ఈయూ అధ్యక్ష పదవిని చేపట్టనుంది. అంటే యూరోపియన్ దేశాలతో మన సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడానికి, మన ప్రయోజనాలను కాపాడుకోవడానికి సైప్రస్ ఉపయోగపడనుంది. ఈయూతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవడానికి కూడా ఈ ద్వీప దేశం మనకు ఉపయోగపడుతుంది.పాకిస్థాన్ సరిహద్దు ఉగ్రవాదం, కశ్మీర్ అంశంతోపాటు.. ఐక్యరాజ్య సమితిలోని భద్రతా మండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం కల్పించాలనే డిమాండ్ విషయంలో సైప్రస్ ఇండియాకు మద్దతునిస్తోంది. ఇటీవల పహల్గామ్ ఉగ్రదాడిని సైతం సైప్రస్ ఖండించింది. పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని ఈయూలో లేవనెత్తుతామని ప్రకటించింది.సైప్రస్‌తో స్నేహం చేయడం వల్ల మధ్యదరా సముద్రంలోని కీలక ప్రాంతంలో మన ప్రాబల్యాన్ని పెంచుకోవచ్చు. సైప్రస్‌లో ఆర్థిక సేవల రంగం చాలా అభివృద్ధి చెందింది. పన్ను విధానాలు అనుకూలంగా ఉంటాయి. షిప్పింగ్ పరిశ్రమ కూడా అభివృద్ధి చెందింది.

దీంతో భారత కంపెనీలు యూరప్ మార్కెట్‌లోకి ప్రవేశించడానికి ఇది అనువైన చోటు అని చెప్పొచ్చు. భారతదేశ వ్యాపారాలకు ఈయూలో గేట్ వేగా సైప్రస్ మారుతుంది. సైప్రస్‌లోని అతిపెద్ద బ్యాంకులలో ఒకటైన యూరో బ్యాంక్, ముంబైలో ఆఫీసును ప్రారంభిస్తామని ప్రకటించింది.భారతదేశంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు పెట్టే విషయంలో సైప్రస్ కీలక పాత్ర పోషించనుంది. రెండు దేశాల మధ్య డబుల్ టాక్సేషన్ అవాయిడెన్స్ అగ్రిమెంట్ ఉంది. తూర్పు మధ్యధరా ప్రాంతంలోని నిక్షేపాల నుంచి సహజ వాయువును వెలికి తీయడంలో సైప్రస్ ముఖ్య పాత్ర పోషిస్తోంది. టర్కీ తవ్వకాల కారణంగా ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు నెలకొన్నాయి. భవిష్యత్తులో భారత్, సైప్రస్ మధ్య ఎనర్జీ సెక్టార్‌లో భాగస్వామ్యానికి అవకాశం ఉంది. మన సహజవాయువు అవసరాలను తీర్చడానికి సైప్రస్ ఉపయోగపడే అవకాశం ఉంది.భారత్–పశ్చిమాసియా– యూరప్ ఎకానమిక్ కారిడార్‌లో సైప్రస్ కీలకమైన భాగం అయ్యే అవకాశం ఉంది. టర్కీ విస్తరణ వాదాన్ని అడ్డుకోవడానికి భారత్ సైప్రస్‌కు ఉపయోగపడితే.. సైప్రస్ ద్వారా మధ్యదరా సముద్ర ప్రాంతంలో భారత్ ప్రాబల్యం పెరుగుతుంది.సైప్రస్‌లోని కొంత భూభాగాన్ని టర్కీ ఆక్రమించిన తర్వాత.. ఉద్రిక్తతలను నివారించడానికి ఐక్యరాజ్య సమితి 'గ్రీన్ లైన్' పేరిట బఫర్ జోన్‌ను ఏర్పాటు చేసింది. ఈ గ్రీన్ లైన్ ఏరియాను సైతం ప్రధాని మోదీ సందర్శించనున్నారు. తద్వారా టర్కీ విస్తరణ వాదాన్ని ఎత్తి చూపడంతోపాటు.. సైప్రస్‌కు తాము అండగా ఉంటామని స్పష్టమైన సంకేతం ఇచ్చినట్లు అవుతుంది.ఆపరేషన్ సింధూర్ సమయంలో టర్కీ లాగే అజర్‌బైజాన్ సైతం పాకిస్థాన్‌కు మద్దుతు ఇచ్చింది. ఆ దేశానికి శత్రుదేశమైన ఆర్మేనియా సైతం భారత్‌తో దోస్తీ కోసం ఆశగా ఎదురు చూస్తోంది. మోదీ త్వరలోనే ఆ దేశంలోనూ పర్యటిస్తారేమో చూడాలి.

# పహల్గమ్‌లో పెరుగుతున్న రద్దీ

**శ్రీనగర్– సూర్య వాస్తవం, జూన్ 17**

జమ్మూ కశ్మీర్‌లోని పహల్‌గామ్‌లో జరిగిన ఉగ్రదాడి తరువాత అక్కడి పర్యాటక ప్రదేశాలన్నీ మూతపడ్డాయి. భద్రతా చర్యల కారణంగా మూసివేసిన పర్యాటక ప్రాంతాలను జమ్మూకశ్మీర్ ప్రభుత్వం మళ్లీ తెరిచింది. దాదాపు రెండు నెలల తర్వాత పహల్‌గామ్ పరిసర ప్రాంతాల్లో పర్యాటకుల రద్దీ కనిపిస్తోంది. రహదారులపై వాహనాలు తిరుగుతున్నాయి. మార్గమధ్యంలో ప్రజలు ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ సెల్ఫీలు దిగుతున్నారు. పహల్గాంతో సహా చుట్టు పక్కల ప్రాంతాలకు పర్యాటకుల తాకిడి పెరిగింది. పర్యాటకుల రద్దీతో పలు చోట్ల వాహనాల రద్దీ ఏర్పడింది. పర్యాటక శాఖ పునరుద్ధరణకు చర్యలు వేగవంతం చేసింది. జమ్మూ–కశ్మీర్‌లో ఎలాంటి వాతావరణ పరిస్థితులు ఉన్నప్పటికీ ఎప్పుడూ పర్యాటకులతో రద్దీగా ఉండేది. అక్కడి స్థానికులు దాదాపు టూరిజం మీదనే ఆధారపడి జీవిస్తున్నారు. కానీ, ఏప్రిల్ 22న జరిగిన ఉగ్రవాద దాడి కాశ్మీర్ లోయలోని పర్యాటక రంగాన్ని తీవ్రంగా దెబ్బతీసింది. గతంలో మాదిరిగా ప్రస్తుతం పర్యాటకుల రావడంలేదని స్థానికులు చెబుతున్నారు. ఈనెల 17 నుంచి మూసీవున్న ప్రాంతాలను తిరిగి పర్యాటకుల సందర్శనార్థం అనుమతిస్తే కొంత మేర పరిస్థితి మెరుగవుతుందని అక్కడి స్థానికులు, చిరు వ్యాపారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# పాకిస్తాన్, ఇరాన్ కకావికలం

**న్యూఢిల్లీ – సూర్య వాస్తవం, జూన్ 17**



ప్రపంచంలో అగ్రదేశాలతో సమానంగా తమ వద్ద కూడా అన్వాయుధాలు ఉండాలని ఇస్లామిక్ దేశాలు కలలు కన్నాయి. అయితే ఇందులో కేవలం మూడు దేశాలు మాత్రమే ఒక అడుగు ముందుకు వేశాయి. కానీ వాటి కలలను అమెరికా, భారత్, ఇజ్రాయెల్ కల్లలు చేశాయి.ఇరాక్, ఇరాన్, పాకిస్తాన్ దశాబ్దాలుగా అణు శక్తి ఆయుధాల రంగంలో తమ ఆధిపత్యాన్ని స్థాపించేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఈ మూడు దేశాల అణు కార్యక్రమాలు వివాదాస్పదంగా, అంతర్జాతీయ ఒత్తిళ్లకు కేంద్రంగా ఉన్నాయి. అయితే, అమెరికా ఇరాక్ అణు కార్యక్రమాలను ఆదిలోనే తుంచేసింది. సద్దాం హుస్సేన్‌ను చంపడంతోపాటు అక్కడి ప్రభుత్వం మార్చడం, అమెరికా సైనిక చర్యలతో ఇరాక్ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా చిన్నాభిన్నమైంది. దీంతో అణ్వయుధం తయారు చేయాలన్న ఇరాక్ కల చెదిరిపోయింది.

ఇక ఇటీవలి పరిణామాలు ఇరాక్, పాకిస్తాన్ దేశాల అణు ఆశలు సవాళ్లను ఎదుర్కొంటున్నాయి.ఇరాన్ అణు కార్యక్రమం, 2015లో జాయింట్ కాంప్రహెన్సివ్ ప్లాన్ ఆఫ్ యాక్షన్ ద్వారా అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించింది. అయితే, 2018లో యునైటెడ్ స్టేట్స్ ఈ ఒప్పందం నుంచి వైదొలగడం, కఠిన ఆంక్షలు విధించడం వల్ల ఇరాన్ అణు కార్యక్రమం తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంది. ఆర్థిక సంక్షోభం, అంతర్జాతీయ ఒడంబడికలలో విశ్వాసం కోల్పోవడం వల్ల ఇరాన్ అణు ఆకాంక్షలు దెబ్బతిన్నాయి. ఇటీవలి చర్చలు ఏ అఖూం ని పునరుద్ధరించడంలో విఫలమవడం, ఇజ్రాయెల్ నుంచి సైనిక ఒత్తిడి ఇరాన్‌ను మరింత ఇరుకున పెట్టాయిపాకిస్తాన్ 1998లో అణు పరీక్షలు నిర్వహించి, అణు శక్తి దేశంగా గుర్తింపు పొందింది. అయినప్పటికీ, ప్రస్తుత ఆర్థిక సంక్షోభం, రాజకీయ అస్థిరత, అంతర్జాతీయ ఆంక్షల భయం పాకిస్తాన్ అణు కార్యక్రమాన్ని దెబ్బతీస్తున్నాయి. అణు ఆయుధాల నిర్వహణ, ఆధునీకరణకు అవసరమైన ఆర్థిక వనరులు కొరవడటం, చైనాపై ఆధారపడటం పాకిస్తాన్‌ను ఒక గండిలో పడేసింది. అంతర్జాతీయ సమాజం నుంచి నిరంతర పరిశీలన, భారత్‌తో ఉద్రిక్తతలు ఈ సవాళ్లను మరింత తీవ్రతరం చేస్తున్నాయి. ఇరాన్, పాకిస్తాన్‌లు అంతర్జాతీయ సమాజం నుంచి విభిన్న ఒత్తిళ్లను ఎదుర్కొంటున్నాయి. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ నుంచి ఆంక్షలు, సైనిక బెదిరింపులు ఉండగా, పాకిస్తాన్‌పై ఆర్థిక సంక్షోభం, ఉగ్రవాద ఆరోపణలు ఒత్తిడి తెస్తున్నాయి. అణు ప్రసార నిరోధక ఒప్పందం వంటి అంతర్జాతీయ చట్రంలో ఈ దేశాలు సమర్థవంతంగా సహకరించలేకపోవడం వాటి అణు కార్యక్రమాలకు అడ్డంకిగా నిలుస్తోంది.ఇరాన్, పాకిస్తాన్ అణు కార్యక్రమాలు విఫలమవడం దక్షిణాసియా, మధ్యప్రాచ్య ప్రాంతాలలో శక్తి సమతుల్యతను ప్రభావితం చేస్తుంది. ఇరాన్ విషయంలో, అణు కార్యక్రమం ఆగిపోవడం ఇజ్రాయెల్, సౌదీ అరేబియా వంటి దేశాలకు వ్యూహాత్మక ప్రయోజనం కల్పిస్తుంది. పాకిస్తాన్ విషయంలో, అణు ఆయుధాల ఆధునీకరణలో వెనుకబడటం భారత్‌తో రక్షణ సమతుల్యతను దెబ్బతీస్తుంది. ఈ రెండు దేశాలూ తమ అణు ఆకాంక్షలను కొనసాగించాలంటే, ఆర్థిక స్థిరత్వం, అంతర్జాతీయ సహకారం కీలకం.

### పాకిస్థాన్‌ను దెబ్బకొట్టిన భారత్..

పహల్గాం ఉగ్రదాడకి ప్రతీకారంగా భారత్ చేపిట్టిన ఆపరేషన్ సిందూర్‌తో 9 ఉగ్రస్థావరాలతోపాటు 11 ఎయిర్ బేస్‌లు ధ్వంసమయ్యాయి. కిరాణా హిల్స్‌లోని పాకిస్థాన్ అణు మానిటరింగ్ సిస్టం దెబ్బతిన్నది. నూర్‌ఖాన్ ఎయిర్ బేస్‌పై దాడితో అమెరికాకు నష్టం కలిగింది.ఇక ఇజ్రాయెల్ దాడితో ఇప్పుడు ఇరాన్ అణ్వాయుధాలు కూడా దెబ్బతిన్నాయి. కనీసం మూడు దశాబ్దాలు వెనక్కి వెళ్లింది. అంటే అణ్వాయుధాలు పునరుద్ధరించుకోవాలంటే మరో 30 ఏళ్లు పడుతుంది. అమెరికా సహకారంతో ఇజ్రాయెల్ టెహ్రాన్‌తోపాటు అణు స్థావరాలను ధ్వంసం చేసింది. ఆర్థికంగానూ ఇరాన్‌ను దెబ్బతీసింది.ఇరాక్, ఇరాన్, పాకిస్తాన్‌ల అణు కార్యక్రమాలు రాజకీయ, ఆర్థిక, అంతర్జాతీయ ఒత్తిళ్ల వల్ల చిన్నాభిన్నమవుతున్నాయి. ఈ దేశాలు తమ అణు ఆకాంక్షలను సాకారం చేసుకోవాలంటే, దౌత్యపరమైన సంబంధాలను మెరుగుపరచడం, ఆర్థిక స్థిరత్వాన్ని సాధించడం అవసరం. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ దేశాల అణు కలలు అంతర్జాతీయ ఒత్తిళ్ల నీడలో కమిలిపోతున్నాయి.

# ఇప్పుడు కాకపోతే ఎప్పుడంటున్న జననేన ఎమ్మెల్యేలు

**ఏలూరు – సూర్య వాస్తవం, జూన్ 17**

24 అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో తిరుగులేని ఆధిపత్యాన్ని చూపించింది జనసేన. జిల్లాలోని ఆరు సీట్లలో పోటీ చేసి అన్ని చోట్ల విజయం సాధించి కంచుకోటగా నిలబడింది. అలాంటి జిల్లాలో పార్టీ అధినేత ఆశించిందొకటి.. ఎమ్మెల్యేలు చేస్తున్నదొకటి అన్నట్టుగా తయారైందట పరిస్థితి. ఇక్కడి నుంచి తొలిసారి ఎమ్మెల్యేలుగా ఎన్నికైన జనసేన నేతలు.. మళ్ళీ అవకాశం వస్తుందో లేదో? భవిష్యత్తు సంగతి మనకెందుకు, దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకుందామన్నట్టు ఆత్రంగా వ్యవహరిస్తున్నారట. గీత దాటుతూ? ఇప్పుడు కాకుంటే ఇంకెపుడు అన్నట్టుగా చేస్తున్న పనులు చూసి జనసేన నేతలే అవాక్కవుతున్నట్టు చెప్పుకుంటున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నుంచి తొలిసారి అసెంబ్లీకి వెళ్ళిన వారిలో నర్సాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, ఉంగుటూరు శాసనసభ్యుడు పత్సమట్ల ధర్మరాజు ఉన్నారు. ఇక సీనియర్ నాయకుల లిస్టులో భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, నిడదవోలు ఎమ్మెల్యే కమ్ మంత్రి కందుల దుర్గేష్, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఉన్నారు. సీనియర్ల సంగతి పక్కనపెడితే పోలవరం, నర్సాపురం, ఉంగుటూరు ఎమ్మెల్యేల అనుచరులు మాత్రం దున్నేస్తున్నారన్న టాక్ ఉంది జిల్లాలో. ఏ పనిచేయాలన్నా, ఏ కాంట్రాక్ట్ దక్కించుకోవాలన్నా, మద్యం వ్యాపారం చేయాలన్నా? షాడోలుగా మారిన ఎమ్మెల్యేల అనుచరగణానికి భారీగా ముడుపులు చెల్లించుకోవాల్సి వస్తున్నట్టు చెప్పుకుంటున్నారు. మంచా చెడా అన్నదాంతో సంబంధం లేదు. పని ఏదైనా సరే?? ఫిక్స్ చేసిన పర్సంటేజ్ ముట్టజెపితే చాలు?. పూర్తి స్థాయిలో సహకరిస్తారట. ఆయా నియోజకవర్గాల్లో ఇది ఓపెన్ టాక్ అంటున్నారు.

నరసాపురంలో ఓఎం బొమ్మిడి నాయకర్ సోదరుడితో సహా మరికొంత మంది నేతలు ప్రతి పనికీ? ఓ రేటు ఫిక్స్ చేస్తున్నారన్న ఆరోపణలు గట్టిగానే వినిపిస్తున్నాయి. ఇటీవల సివిల్ తగాదాల్లో సైతం ఎమ్మెల్యే మనుషులు తలదూర్చి సెటిల్మెంట్స్ చేయడం వివాదాస్పదమవుతున్నట్టు చెబుతున్నారు.

నరసాపురం నియోజకవర్గంలో ఏ వ్యాపారం మొదలు పెట్టాలన్నా? ముందు నాయకర్‌కు కావాల్సిన వాళ్ళని కలిస్తేనే? పనవుతుందని, వాళ్ళకు సమర్పించుకోకుంటే? ఏ పనీ చేయలేరన్న ప్రచారం జోరుగా ఉంది. మట్టి తవ్వకాల విషయంలో జనసేన నేతల ఆగడాలపై? మిత్రపక్షం టీడీపీ నాయకులే ఫిర్యాదు చేసేవరకు వెళ్ళిందంటే? పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చున్నది లోకల్ వాయిస్. ప్రభుత్వ భూముల్లో అక్రమ తవ్వకాలు, తమ సామాజికవర్గానికి చెందిన వారితో సెటిల్మెంట్స్‌లాంటి ఆరోపణలు పెరుగుతున్నాయి. తొలిసారి ఎమ్మెల్యే అయిన నాయకర్ సలహాదారులు, సెటిల్మెంట్ చేసే బ్యాచ్‌తో పెద్ద కోటరీనే ఏర్పాటు చేసుకున్నారని జనసేన నేతలే గుసగుసలాడుకుంటు న్నారట.

ఇక పోలవరం విషయంలోనూ ఇదే పరిస్థితి.ఎమ్మెల్యే మనుషులమంటూ కొంతమంది అక్రమాలకు తెరలేపడంతో నియోజకవర్గంలో చులకన భావం ఏర్పడుతోందని తెగమధన పడిపోతున్నారట తెలుగు తమ్ముళ్ళు. జనసేన ఎమ్మెల్యే పనులు తమకు తలవంపులు తెస్తున్నాయన్నది వాళ్ళ వాదనగా తెలుస్తోంది. మొత్తం ఏడు మండలాల్లో ఎమ్మెల్యే షాడోస్‌ని పెట్టుకుని బీభత్సంగా వసూళ్ళకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు పెరుగుతున్నాయి. అయితే కొన్ని విషయాలపై ఎమ్మెల్యేకు అవగాహన తక్కువ ఉందని భావిస్తున్న కొందరు చోటామోటా నేతలు ఆయన దృష్టికి తీసుకురాకుండానే పర్సనల్‌గా పనులు చక్కబెట్టుకుంటూ? అందినకాడికి దోచు కుంటున్నారట. అటు ఉంగుటూరు నియోజకరర్గంలోనూ ఇదే పరిస్థితి ఉన్నట్టు చెప్పుకుంటున్నారు. తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన పత్సమట్ల ధర్మరాజు చుట్టూ చేరిన ఆయన సొంత సామాజికవర్గ నేతలు?. పోలీసులు, ఇతర అధికార యంత్రాంగాన్ని చేతిలో పెట్టుకుని అక్రమ చేపల చెరువులు నిర్వహిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఏడాది గడిచినా ఎమ్మెల్యేలకు కొన్ని శాఖలపై పట్టు రాకపోవడం? షాడోలకు వరంగా మారిందని, ఎమ్మెల్యేల పేరుతో వాళ్ళే ఆదేశాలిస్తూ?. తమ పబ్బం గడుపుకుంటున్నట్టు చెప్పుకుంటున్నారు. తీరా అవినీతి ఆరోపణలు వచ్చేసరికి ఆ నిందలన్నీ ఎమ్మెల్యేలపై పడుతున్నాయట. ఈ విషయంలో తెలిసి కూడా వాళ్ళేమీ చేయలేకపోతున్నట్టు ప్రచారం జరుగుతోంది. డ్యామేజ్ జరిగిపోతున్నా? నాయకులు సీరియస్ యాక్షన్ తీసుకోకపోవడానికి కారణాలు అనేకం ఉన్నట్టు తెలుస్తోంది. తాము పట్టుకోల్పోతే? ఆ స్థానంలో టిడిపి నేతలు ఎక్కడ అజమాయిషీ చెలాయిస్తారోనన్న భయం ఉందని, అందుకే? ఏదైతేనేం? నడిచేదేదో నడవనీ? మనది మనకి వస్తోంది కదా అనుకుంటున్నట్టు సమాచారం. కానీ? ఆ ఉదాసీనతవల్ల పార్టీకి చెడ్డపేరు వస్తున్నట్టు ఫీలవుతోంది కేడర్. ఈ డ్యామేజ్ కంట్రోల్‌కి హైకమాండ్ ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటుందో చూడాలి మరి.

# ఏడాది సంబురాల్లో కనిపించని కమలం

**విజయవాడ – సూర్య వాస్తవం, జూన్ 17**

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అయింది. ఈ ఏడాది కాలంలో జరిగిన పాలనపై రాష్ట్ర ప్రభుత్వం సంబరాలకు సిద్ధమైంది. ప్రధానంగా ప్రజలను కలుసుకోవడం ప్రజల సంతృప్తిని లెక్క వేసుకోవడం వారికి అనుకూలంగా మళ్లీ కార్యక్రమాలు నిర్వహించడం అనేది రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమం. అయితే కూటమి పార్టీలుగా విజయం దక్కించుకున్న వాటిలో బీజేపీ కీలకమైంది. కేంద్రంలో ఈరోజు మోడీ ప్రభుత్వం ఏర్పడడానికి రాష్ట్రంలో ఏర్పడిన చంద్రబాబు ప్రభుత్వం అత్యంత ముఖ్యమైనది. ఇది అందరికీ తెలిసిందే.ఇలాంటి సమయంలో కేంద్రంలో కూటమి ప్రభుత్వాన్ని బలపరుస్తున్న చంద్రబాబుకు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాన్ని బలపరచాలన్నటువంటి ఆలోచన బిజెపికి రాకపోవడం చాలా శోచనీయం. ఎందుకంటే రాష్ట్రంలో ప్రభుత్వం ఏడాదిపాలనపై కార్యక్రమాలను నిర్వహిస్తున్నా.. బిజెపి నాయకులు ఎక్కడా కనిపించడం లేదు. ముఖ్యంగా తల్లికి వందనం వంటి పథకాన్ని అమలు చేసినప్పుడు కూడా దీనిపై ఒక్కరంటే ఒక్కరు కూడా స్పందించలేదు. దీనివల్ల అనేకమంది మహిళలకు లబ్ధి జరుగుతోందని ఒక ప్రెస్ మీట్ గాని ఒక ప్రకటన గాని విడుదల చేయలేదు.అలాగే పింఛన్ల పెంపు, ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం వంటి వాటిపై కూటమీ పాలకులు ఒకవైపు ప్రకటనలు చేస్తున్న బిజెపి పక్షాన ఎవరు నోరు ఎత్తటం లేదు. మరి దీన్ని ఎలా చూడాలి? ఏ విధంగా అర్థం చేసుకోవాలి అంటే రేపు ఏదైనా ప్రజల్లో అసంతృప్తి రగిలి అసంతృప్తి కారణంగా విమర్శలు చేస్తే మా తప్పులేదు అని తప్పించుకునే దారి బిజెపిలో కనిపిస్తోందా? లేకపోతే రేపు రాష్ట్ర ప్రభుత్వం అప్పులు చేస్తే దానికి మాకు సంబంధం లేదు మేము నిమిత్త మాత్రులం అని తప్పించుకునే దారి కనిపిస్తోందా అంటే అవునని అంటున్నారు పరిశీలకులు.కూటమి ప్రభుత్వంలో ఏం చేసినా అది మూడు పార్టీలకు వర్తిస్తుంది. రేపు ఓట్లు అడిగే విధానాన్ని పరిశీలిస్తే మూడు పార్టీల పరంగానే ప్రజల్లోకి వెళ్లాలి. మూడు పార్టీల పరంగానే ప్రజలను ఓట్లు అభ్యర్థించాలి. ఈ విషయంలో బిజెపి నాయకులు అనుసరిస్తున్న ధోరణి ప్రధానంగా చర్చగా మారింది. ఇది సరికాదని ప్రజల్లోకి రావాలనేది కూటమి పార్టీలకు చెందిన సీనియర్ నాయకులు సూచిస్తున్నారు. నిజానికి గత ఎన్నికల్లో విజయం ఎలా ఉన్నా వచ్చే ఎన్నికల నాటికి ఈ ఐదేళ్ల పాలనను చూసి మాత్రమే ప్రజలు ఓటేస్తారు తప్ప జగన్ పై విమర్శలు చేయడం ద్వారా ఓట్లు ఎంతవరకు పడతాయి అనేది చూడాలి.కాబట్టి మళ్ళీ ఎన్నికల్లో విజయం దక్కించుకోవాలన్నా.. మళ్లీ ఎన్నికల్లో మెజారిటీ ఓట్లు సాధించాలన్నా కూడా అందరూ కలిసికట్టుగా సంయుక్తంగా ప్రజల మధ్య ఉండడం ప్రజల సమస్యలు పట్టించుకోవడం ముఖ్యం. సంతృప్తిని కూడా అంచనా వేసుకోవడం వంటివి బిజెపి నాయకులు కూడా చేయాల్సిన అవసరం ఉందనేది పరిశీలకులు చెబుతున్న మాట. మరి కమల నాథులు ఏమంటారో చూడాలి.

## మంత్రిసోదరుడిని మర్యాద పూర్వకంగా కలిసిన నూతన తహశీల్దార్‌లు



**రాయచోటి-సూర్య వాస్తవం,జూన్17 :** అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణములోని సంజీవ్‌నగర్ కాలనీలో ఉన్న మంత్రి క్యాంపుకార్యాలయంలో మంగళవారం రామాపురం ఎమ్మార్వో వెంకటేష్, లక్కిరెడ్డి పల్లి ఎమ్మార్వో క్రాంతి కుమార్‌లు రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి విశాఖపట్నం క్యాంపులో ఉన్నందువల్ల మంత్రి సోదరుడు టిడిపి నియోజకవర్గ నాయకుడు డాక్టర్ లక్ష్మి ప్రసాద్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి వారు పుష్పగుచ్ఛంతో సత్కరిం చారు.ఈ సందర్భంగా లక్ష్మి ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యలను ఎప్పటి కప్పుడు పరిష్కరించి కూటమి ప్రభుత్వానికి, మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. మంత్రి సోదరుడి ని కలిసిన వారిలో రాయచోటి తహసిల్దార్ నరసింహ కుమార్ కూడా ఉన్నారు.

## అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

### - మృతుడి ఒంటి పై కత్తి పోట్లు



**రాయచోటి-సూర్య వాస్తవం, జూన్,17 :** అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని బస్టాండ్ దగ్గర ఉన్న ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఆవరణంలో గుర్తు తెలియని యువకుడు అనుమానస్పద స్థితిలో మృతి చెందడం కలకలం రేపింది. ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చినవారు మృతదేహాన్ని చూసి స్థానిక పోలీసులకు సమాచారం అంధించడంతో మంగళవారం పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి మృతుడి ఒంటిపై కత్తిపోట్లు, గాయాలు ఉన్నాయని, మృతదేహం పక్కనే మద్యం బాటిల్లు పడి ఉన్నాయని, పోలీసులు ఘటనా స్థలంలో మృతదేహాన్ని పరిశీలించి విచారణ చేపట్టి, ఇది హత్య, ఆత్మహత్య లేదా ఎక్కడైనా హత్య చేసి అక్కడ నుంచి తీసుకొచ్చి ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణంలో పడేశారా అనే కోణంలో పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేపట్టారు. ఏది ఏమైనాప్పటికీ మృతుడి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. మృతదేహం పరిశీలించిన వారిలో యస్.ఐ విష్ణువర్ధన్, సిబ్బంది రాజు, మదన, తదితరులు ఉన్నారు.

## మున్సిపల్ కమిషనర్ జబ్బర్ మియాను అభినందించిన భారత కమ్యూనిస్టు పార్టీ



**గుత్తి -సూర్య వాస్తవం,జూన్ 17 :** గుత్తి మున్సిపాలిటీ ఆఫీసు నందు భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో మున్సిప ల్ కమిషనర్ జబ్బర్ మియా ను అభినందించడం జరిగిం ది.గత వారం రోజుల కిందట గుత్తి మున్సిపాలిటీలో ఉన్న టు వంటి డ్రైనేజీలు చెత్త కు ప్పలు చిన్న కాలువలు రోడ్డు గుంతలో నీళ్లు నిలువ ఉండ కూడదు దీనివల్ల ప్రజలకి సీ జనల వ్యాధులు వ్యాపిస్తా యి వాంతులు విరోచనాలు టైఫాయిడ్ మలేరియా రకర కాల వ్యాధులు వర్షాలు ఎ క్కువ పడే అవకాశాలు ఉ న్నాయి కాబట్టి ఇలాంటి సీజ న్ వ్యాధులు సంభవించి గుత్తి ప్రజల్ని ఈ యొక్క సీజన్ వ్యాధి లాంటి కాపాడాలని చె ప్పి నిరసన కార్యక్రమం చేయడం జరిగింది దీనికి ఫలి తంగా స్ప్రే మిషన్లు సుమారు 12 వరకు మన గుత్తి ము న్సిపాలిటీకి తెప్పియడం జరిగింది. అదేవిధంగా నిన్నటి ది నము పేపర్లో కూడా రావడం జరిగింది మరి అన్నిటికన్నా ప్రధానమైనది ప్రజల ఆరో గ్యం పరిసరాల పరిశు భ్రత స్ప్రే చేయడం బ్లీచింగ్ పౌడ ర్ వేయడం కాలువలు శు భ్రం పరచడం దీనిపైన కమిషనర్ స్పందించి శానిటేషన్ మీద శ్రద్ధ చూపించడం జరి గింది ఇక ఈ సీజన్ వ్యాధుల పైన మరిన్ని జాగ్రత్తలు తీ సుకోవాలని కోరడం దీనికి స్పందించి మా పరిధిలో ఉన్నటువంటి ఎటువంటి కార్య క్రమాలు అయినా నేను చేస్తా నని చెప్పి మాటే ఇవ్వడం జరిగింది. అందుకు కమ్యూని స్టు పార్టీ అభినందించడం అనేది చాలా అరుదు మరి ఆరోగ్యమై నటువంటి సమ స్యలు తీసుకుని ఆయన పనిచేస్తు న్నందుకు అభినం దించడం జరిగింది.ఈ కార్య క్రమంలో సిపిఐ మండల కా ర్యదర్శి జి రామదాసు పట్ట ణ కార్యదర్శి రాజు యాదవ్ రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షులు వెంకట్ రాముడు మండల సహాయ కార్యదర్శి నరసింహయ్య నియోజకవ ర్గం మహిళా సమైక్య కార్యదర్శి మహమ్మదా రసూల్ బి గోపాల్ సూరి ఆటో రామంజి తదిరులు పాల్గొనడం జరిగింది.

## గంగమ్మ దేవి పూజలో పాల్గొన్న యువనేత గుమ్మనూరు ఈశ్వర్



**గుత్తి-సూర్య వాస్తవం,జూన్ 17:** గుత్తి పట్టణ రజకసంగం ప్రత్యేక ఆహ్వానం మేరకు గుత్తి పట్టణ శివారు చెరువు కట్టవద్ద గంగమ్మ దేవి పూజా కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్న గుంతకల్లు నియోజకవర్గం శాసన సభ్యులు గుమ్మ నూరు జయరాం తనయుడు, యువనేత పామిడి,గుత్తి ఇంచార్జ్ గుమ్మనూరు ఈశ్వర్ ఈ కార్యక్రమంలో గుత్తి పట్టణ, మండల కూట మి నాయకులు, కార్య కర్తలు పాల్గొన్నారు.

# టోకెన్ పద్ధతిని ప్రవేశపెట్టండి

### - జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్





**తిరుపతి-సూర్య వాస్తవం, జూన్ 17:** మామిడిపండ్ల గుజ్జు తయారీ పరిశ్రమల వద్ద టోకెన్ పద్ధతిని ప్రవేశపెట్టాలని జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ పరిశ్రమల యజమానులకు సూచించారు. మంగళ వారం రేణిగుంట మండలం, ఎస్ఎన్ పురం గ్రామంలోని శ్రీ వర్ష ఫుడ్ ప్రాడక్ట్ ఇండియా లిమిటెడ్ కు చెందిన మామిడి పండ్ల గుజ్జు తయారీ పరిశ్రమ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా తోతాపురి మామిడకాయలను తీసుకువచ్చిన రైతులకు ముందు వచ్చిన రైతులకు ముందుగా టోకెన్ జారీ చేసే పద్ధతిని ప్రవేశపెట్టాలని సూచించారు.ముందుగా ఒక ట్రాక్టర్ మామిడికాయలను ఎంత బరువు ఉంటుందో పరిశ్రమలోని వే బ్రిడ్జి వద్ద బరువును పరిశీలించారు. రైతులు తీసుకువచ్చే మామిడి కాయలను నమోదు చేసే ప్రక్రియను సంబంధిత ఉద్యానవనశాఖ అధికారుల నుండి అడిగి తెలుసుకున్నారు. ముందుగా మామిడికాయలతో నిండి ఉన్న ట్రాక్టర్‌ను బరువు వేయడం జరుగుతుందని,ఆ కాయలు అన్లోడ్ చేసిన తర్వాత ఖాళీ ట్రాక్టర్ బరువును తూచి ఖాళీ బరువును తీసివేసి మిగిలిన బరువును నమోదు చేయడం జరుగు తుందన్నారు. అనంతరం పరిశ్రమలో మామిడి కాయలను నిల్వ ఉంచిన ప్రదేశాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీ వర్ష ఫుడ్ ప్రోడక్ట్ ఇండియా లిమిటెడ్ చైర్మన్ విశ్వనాథ నాయుడు తమ యూనిట్లో 250 నుండి 300 టన్నులవరకు నిల్వ ఉంచుకొనే సామర్థ్యం ఉందని తెలిపారు. ప్రస్తుతం 15 రైపనింగ్ చాంబర్స్‌లో పూర్తిస్థాయిలో మామిడికాయలు నిల్వలు ఉన్నాయన్నారు. అందుకనే తాము ఇంకా రైతుల వద్ద నుంచి మామిడి కాయలను అన్లోడ్ చేయలేదన్నారు.అనంతరం మామిడి పండ్లను శుద్ధి చేసే తీరును అక్కడి నుండి వాటిని గుజ్జుగా తయారు చేసే విధానాన్ని ఆ పరిశ్రమ డైరెక్టర్లు విశ్వాస్, వర్ష లు జిల్లా కలెక్టర్ వివరించారు. ఆ యూనిట్ మొత్తాన్ని జిల్లా కలెక్టర్ నిశితంగా పరిశీలించారు.

ఈ సందర్భంగా అక్కడే ఉన్న మామిడికాయలను తీసుకువచ్చిన రైతులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు సిద్ధంగా ఉందని, ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. తమ తోతాపురి మామిడికాయలను పూర్తి కాపు అయ్యేంతవరకు స్థానిక మామిడి పండ్ల గుజ్జు తయారీ పరిశ్రమలు కేంద్రాలు రైతుల నుండి మామిడికాయలను తీసుకుంటాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మామిడిపళ్ళ గుజ్జు తయారి పరిశ్రమ యజమానులకు కేజీకి 8/- రూపాయలు చొప్పున రైతులకు అందించాలని సూచించిందని, అదే సమయంలో ప్రభుత్వం నుంచి రైతులకు ఒక కేజీకి నాలుగు రూపాయల చొప్పున సబ్సిడీని కూడా ప్రభుత్వం రైతులకు అందిస్తుందన్నారు. జిల్లాలోని తోతాపురి మామిడికాయల రైతులను ఆదుకునేందుకు జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు.

ప్రతి పరిశ్రమ వద్ద ఉద్యానవన శాఖ అధికారులను, రెవెన్యూ అధికారులను ఏర్పాటు చేశామని, వారు రైతులు మామిడి పండ్ల పరిశ్రమల గుజ్జు తయారీ కేంద్రాల వద్దకు తీసుకువచ్చే మామిడికాయల టన్నులను నమోదు చేసుకోవడం జరుగుతోందన్నారు. ఆమేరకు ప్రభుత్వం అందించే సబ్సిడీని రైతుల ఖాతాలో నేరుగా జమ చేయడం జరుగుతుందన్నారు. ఎప్పటికప్పుడు రైతులు తీసుకొని వచ్చే మామిడికాయల వివరాలను కంప్యూటరీకరించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ముందుగా స్థానిక రైతులకు ప్రాధాన్యత ఇవ్వాలని సంబంధిత పల్ప్ యూనిట్ల యజ మానులకు జిల్లా కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో ఏపీఎంఐపీడీ సతీష్, మార్కెటింగ్ ఎడి సురేంద్రబాబు,స్థానిక తహసిల్దార్ సురేష్ బాబు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### మామిడి రైతులను

# రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుంది

**- జిల్లాలోని మామిడి రైతులు ఎవరు ఆందోళన చెందొద్దు**
**- జిల్లా కలెక్టర్ డా ఎస్. వెంకటేశ్వర్**



**తిరుపతి- సూర్య వాస్తవం, జూన్ 17 :** జిల్లాలోని తోతాపూరి మామిడి రైతులను రాష్ట్ర ప్రభుత్వము అన్ని విధాలుగా ఆదుకుంటుందని ఎవరు ఆందోళన చెందవద్దని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం ఉదయం స్థానిక కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు జిల్లా కలెక్టర్ డా ఎస్. వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి దశరథ రామిరెడ్డితో కలిసి మామిడి సేకరణ పై మీడియా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం మామిడి రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటుందని ఎవరు ఆందోళన చెందవలసిన అవసరం లేదని తెలిపారు. వాతా వరణ పరిస్థితులు, రైతులు తీసుకున్న జాగ్రత్తలు వలన మామిడి దిగుబడి పెరిగిందని తెలిపారు. జనవరి నుంచి కూడా రైతులు మామిడి పండ్లు నాణ్యత క్వాలిటీ బాగుండాలని, మార్కెట్లో ఎక్కువ ధర రావాలనే ఉద్దేశంతో ఎరువులు వాడకం ప్రతిసారి రెండు మూడు సార్లు ఎరువులు వాడడం కంటే అదనంగా ఎక్కువ వాడడం జరిగిందని తెలిపారు. దీనివలన ఇన్పుట్ కాస్ట్ పెరగడం జరిగిందని తెలిపారు. గడిచిన రెండు మూడు సంవత్సరాల కంటే గుజ్జు పరిశ్రమ ఈ సంవత్సరం ఎగుమతి ఎక్కువ చేయడం జరిగిందని అన్నారు. అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులు, యుక్రేయన్ యుద్ధం వలన మామిడి పల్ఫ్ ఎగుమతి అనేది చాలావరకు తగ్గిందని అన్నారు. పక్క రాష్ట్రాలైనటువంటి తమిళనాడు కర్ణాటకలో క్రిష్ణగిరి మార్కెట్ నుంచి మార్కెట్ గుజ్జు పరిశ్రమల నుంచి పార్లే ,కోకోకోలా, పెప్సీ కంపెనీ వాళ్లు ఎక్కువగా కొనుగోలు చేశారని తెలిపారు. దాని కారణంగా గత రెండు సీజన్ లోను గుజ్జు నిల్వలు అలాగే ఉండిపోయాయని తెలిపారు.

ఈ నేపథ్యంలో జిల్లా స్థాయిలో ప్రజా ప్రతినిధులు అధికారులు గుజ్జు పరిశ్రమలు ,రైతులు, రైతు సంఘాల నేతలతో సమావేశం నిర్వహించి సమస్యలు తెలుసుకొని ప్రభుత్వానికి తెలియజేయడం జరిగిందని తెలిపారు. మామిడి గుజ్జు పరిశ్రమలు తీసుకున్న లోన్లకు సంబంధించిన వడ్డీల విషయంలో ప్రత్యేక కార్యాచరణం చేయడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రైతులు ఎక్కడ కూడా నష్ట పోకుండా రైతులకు న్యాయం జరిగేలా మద్దతు ధర కిలోకి 12 రూపాయల కొనుగోలుతో తోతాపూరిని కొనుగోలు చేయలని ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. ప్రాసెసింగ్ యూనిట్ వారు రైతులకు చెల్లించాల్సిన ధర 8 రూపాయలు, 4 రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ రూపంలో రైతులకు చెల్లించడం జరుగుతుందని తెలిపారు. రైతులు ఎక్కడ కూడా నష్టపోకుండా ప్రతి రైతు చివరి పంట వరకు అందరినీ ప్రభుత్వము ఆదుకుంటుందని తెలిపారు. వ్యవసాయ శాఖ మంత్రివర్యులు కూడా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ని రైతులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేయడం జరిగిందని ఎక్కడ కూడా ప్రాసెస్ యూనిట్ వారు రైతులను ఇబ్బంది పెట్టడం జరగకూడదని వారి పైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. గడిచిన వారం నుంచి తిరుపతి జిల్లాలో రోజుకు 2 వేల మెట్రిక్ టన్నులు మనం రీచ్ అవుతున్నాము అని ఈరోజుతో కలిపి 16 వేల మెట్రిక్ టన్నులు ప్రోసెస్ చేయడం జరిగిందని అన్నారు. జిల్లాలో 27 కలెక్షన్ల ర్యాంపులు , రెండు వ్యవసాయం మార్కెట్ యార్డులు సేకరణలో ఉన్నాయని తెలిపారు.

ప్రతి ప్రాసెసింగ్ యూనిట్ ర్యాంప్ మార్కెట్ యార్డ్ వద్ద సేకరణ పర్యవేక్షించడానికి సంబంధిత అధికారులు ఉన్నారని తెలిపారు. రైతులు ఎలాంటి తొందరపాటు లేకుండా పంట కోత కోయవద్దని అలాగే మామిడి పక్వానికి వచ్చిన తరువాత కోయాలని తెలిపారు. చివరి కేజీ వరకు ప్రభుత్వము ప్రతి రైతుకి నాలుగు రూపాయల సబ్సిడీ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. రైతులు మండీలు, ట్రేడర్స్ గుజ్జు పరిశ్రమల దగ్గరికి తొందరపడి వెళ్ళవద్దని దిగుబడు రాక ముందే కోతకోయొద్దని తెలిపారు. జిల్లాలోని మామిడి రైతులకు ఎలాంటి సందేహాలు ఉన్న క్రింది హెల్ప్ లైన్ కు కాల్ చేసి తెలుసుకోవలసిందిగా జిల్లా కలెక్టర్ తెలిపారు . హెల్ప్ లైన్ నెంబర్ : 0877 2236007,ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవ సాయ అధికారి ప్రసాద్, ఉద్యన శాఖ అధికారులు , సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా గంగమ్మ పెద్దమ్మ దేవర మహోత్సవం

**- ప్రత్యేక పూజలు నిర్వహించిన రజక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.లింగమయ్య**



**పామిడి- సూర్య వాస్తవం, జూన్ 17:** పామిడి గ్రామంలో గంగమ్మ పెద్దమ్మ జాతరలో ప్రత్యేక పూజలలో రజక వృత్తి దారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి. లింగమయ్య రజక వృత్తిదారుల సమాఖ్య సి రాజేష్ టైలర్ శ్రీరాములు పాల్గొ న్నారు. మంగళవారం పామిడి రజకులు గంగమ్మ కి పూజలు అందిస్తూ గంగమ్మ జాతర చేస్తూ పెద్దమ్మ గంగమ్మకు యాటలు పడుతూ పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంవ త్సరానికి ఒకసారి ఈ జాతర చేసుకు ంటామని పేర్కొన్నారు. రజక సోదరి సోదరులు అంగరంగ వైభోగంగా జరుపుకున్నార న్నారు. ఎందుకు ఈ రకంగా నిర్వహించుకుంటారంటే వానలు బాగా కురవాలని, కరువు పారదోలాలని నుంచి ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని రజక సోదరి సోదరులు గంగమ్మని పెద్దమని ఈ రకంగా పూజలు నిర్వహించడం ఆనవాయితీగా ఉందన్నారు. గంగమ్మ పెద్దమ్మ పూజలు చేయడానికి దోబీ ఘాట్ కమ్యూనిటీ హాల్ నుంచి పామిడి మెయిన్ బజార్ మీదుగా పామిడి బొడ్రాయి పెద్దమ్మ గుడిలోని గంగమ్మ ను పామిడి పెన్నా నదిలో పూజలు నిర్వహించారు. ఈ కార్య క్రమంలో రజక వృత్తిదారుల సమాఖ్య జిల్లా అధ్యక్షులు సి నాగప్ప పామిడి రజక వృత్తిదారుల సమాఖ్య అధ్యక్షులు సి సుంకన్న, పామిడి రజక వృత్తిదారుల సమాఖ్య ఉపాధ్యక్షుడు సి రాజేష్ రజక వృత్తిదారుల సమాఖ్య పామిడి నాయకులు టైలర్ శ్రీరాములు, పామిడి ఈ. సుంకన్న, రజక వృత్తిదారుల సమాఖ్య పామిడి కార్యదర్శి అనిల్ కుమార్, కొత్త రాయుడు, నరసింహులు తదితరులున్నారు.

# తల్లికి వందనం సంబరాలలో ఎమ్మెల్యే దగ్గుపాటి

- ప్రభుత్వ బడిలో అడ్మిషన్ల కోసం సిఫార్సులు చేసే రోజులు చూస్తారు
- విద్యాశాఖ విషయంలో మంత్రి నారా లోకేష్ కొత్త ఒరవడితో ముందుకు వెళ్తున్నారు
- కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్
- జగన్ ఫోటోలతో గతంలో స్కూల్ కిట్స్ ఇచ్చారని ఎమ్మెల్యే ఆగ్రహం



**అనంతపురం క్రైం – సూర్య వాస్తవం, జూన్ 17:** ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు సిఫార్సులు చేయించుకునే రోజులు త్వరలోనే చూస్తారని విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ ఆధ్వర్యంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొస్తున్నారని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. తల్లికి వందనం పథకం ప్రారంభమైన నేపథ్యంలో నగరంలోని ఓల్డ్‌టౌన్‌లో ఉన్న ప్రభాకర్ పాఠశాలలో సంబరాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడుయాదవ్, విద్యార్థులు,ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ముందుగా పిల్లల చేత ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారాలోకేష్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఆ తర్వాత థాంక్యూ సీఎం సర్, థాంక్యూ లోకేష్ సార్ అంటూ పిల్లలు ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ తల్లికి వందనం పథకంతో ప్రతిఒక్కరిలో ఆనందం కనిపిస్తోందన్నారు. తల్లిదండ్రులు ఎంతో సంతోషంగా పిల్లల్ని పాఠశాలలకు పంపుతున్నారన్నారు. పాఠశాలకు వచ్చే విద్యార్థుల కోసం మెరుగైన సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. గత ఐదేళ్లలో 12 లక్షల మంది విద్యార్థులు బడి మానేశారని ఇప్పుడు తిరిగి 12 లక్షల మంది బడికి వస్తున్నారని ఎమ్మెల్యే దగ్గుపాటి అన్నారు. బడికి వెళ్లే ప్రతి విద్యార్థికి తల్లికి వందనం పథకం వస్తుందని.. ఇంకా కొంతమంది రానివారికి.. త్వరలోనే అందుతుందని స్పష్టం చేశారు. గతంలో ప్రతి విద్యార్థి నుంచి 2వేల రూపాయలు తీసుకొని ఏం చేస్తారో సమాధానం చెప్పాలన్నారు. ప్రస్తుతం ఈ రెండు వేల రూపాయలు పాఠశాల అభివృద్ధికి కేటాయిస్తున్నట్లు చెప్పారు. దీనికి తోడు పిల్లలకు ఇచ్చే బ్యాగుల మీద జగన్ ఫోటో ఉండటంపై ఆయన తీవ్రంగా స్పందించారు. ఒక అరాచకుడు, అవినీతిపరుడి ఫోటో చూస్తూ పిల్లలు చదువుకోవాల్సిన దౌర్భాగ్య పరిస్థితి కల్పించారన్నారు. కానీ ఇప్పుడు పిల్లల్లో స్ఫూర్తి నింపే విధంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ వంటి మహనీయుల ఫోటోలతో పిల్లలకు విద్యా కానుకలు అందిస్తున్నట్లు ఎమ్మెల్యే దగ్గుపాటి తెలిపారు. మరోవైపు జిల్లా అధ్యక్షుడు, కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ వెంకట శివుడు యాదవ్ మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తుంటే ప్రభుత్వానికి ఎక్కడ మంచి పేరు వస్తుందోననే ఆందోళన వైసీపీలో కనిపిస్తోందన్నారు. అందుకే వారు ఇలాంటి విమర్శలు చేస్తున్నారని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు.



# మీ త్యాగం వెల కట్టలేనిది

## - జవాన్ మురళి నాయక్ కుటుంబానికి రూ.50 లక్షల చెక్కు అందజేసిన మంత్రి సవితమ్మ




**శ్రీ సత్య సాయి బ్యూరో –సూర్య వాస్తవం, జూన్ 17 :** దేశం కోసం ఆపరేషన్ సింధూర్ యుద్ధంలో వీరమరణం పొందిన మురళి నాయక్ త్యాగం వెల కట్టలేనిదని రాష్ట్ర బిసి సంక్షేమం, జౌళి, టెక్స్ టైల్స్ శాఖా మంత్రి యస్. సవితమ్మ అన్నారు. గోరంట్ల మండలం కల్లితాండా గ్రామానికి చెందిన వీర జవాన్ మురళీ నాయక్ త్యాగాన్ని గౌరవిస్తూ, వారి కుటుంబసభ్యులకు మంగళవారం మంత్రి రూ.50 లక్షల ఆర్థిక సాయం, 5 ఎకరాల పొలం, గోరంట్ల లే అవుట్ నందు 6 సెంట్ల ఇంటి స్థలాన్ని ప్రభుత్వం తరపున అందచేశారు.ఈ సందర్భంగా మంత్రి సవితమ్మ మాట్లాడుతూ..జవాన్ స్మారకార్థం రూ.14 లక్షల వ్యయంతో సమాధిని నిర్మించడమే కాకుండా, ఇంటి నుండి సమాధి వరకు సీసీ రోడ్ ను నిర్మించడానికి ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. గ్రామస్థుల అభ్యర్థన మేరకు వీర జవాన్ స్వగ్రామమైన కల్లి తాండాకు ఆయన పేరు పెట్టడానికి చర్యలు చేపట్టామన్నారు. మురళి నాయక్ విగ్రహం ఏర్పాటుకు పనులు కూడా త్వరలో ప్రారంభం కానున్నాయన్నారు.జవాన్ ప్రాణత్యాగం ఈ ప్రాంతానికి, జిల్లా, రాష్ట్రానికే కాక దేశానికే గర్వకారణం అన్నారు. వారి తల్లిదండ్రులకు మంత్రి కృతజ్ఞతలు తెలుపుతూ, ఎల్లప్పుడూ వారి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు.గతంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, రాష్ట్ర ఐటీ , విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ కల్లితండాకు వచ్చి జవాన్ మురళి నాయక్ కు ఘన నివాళులు అర్పించారన్నారు. మంత్రి నారా లోకేష్ కూటమి ప్రభుత్వం తరపున ప్రకటించిన హామీని నెరవేర్చామన్నారు. అనంతరం జవాన్ మురళి నాయక్ సమాధి వద్దకు వెళ్లి పుష్పగుచ్ఛం ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా జవాన్ తల్లిదండ్రులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ, జిల్లా సైనిక్ సంక్షేమధికారి తిమ్మప్ప, డీఐపీఆర్వో వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఏడాది కాలంలో 4 పంచాయతీల్లో 10కోట్లతో అభివృద్ధి

- మరో 28 కోట్ల రూపాయలతో ప్రతిపాదనలు
- అనంతపురం రూరల్ మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే దగ్గుపాటి
- పంచాయతీల్లో ఏ సమస్య ఉన్నా..నా దృష్టికి తీసుకురావాలని సూచన



**అనంతపురం క్రైం – సూర్య వాస్తవం, జూన్ 17:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే అనంతపురం అర్బన్ నియోజకవర్గంలోని 4 పంచాయతీల్లో పది కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేసినట్లు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. అనంతపురం ఎంపీడీఓ కార్యాలయంలో రూరల్ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించగా ఇందులో ఎమ్మెల్యే పాల్గొన్నారు. నాలుగు పంచాయతీల పరిధిలో నెలకొన్న సమస్యలు, చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాల గురించి కూడా చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ ఇప్పటికే 10 కోట్ల రూపాయలతో నాలుగు పంచాయతీల్లో సీసీ రోడ్లు వేసినట్లు తెలిపారు. మరో ఆరు కోట్ల రూపాయల పనులు ప్రతిపాదనలు పంపించామన్నారు. రోడ్లు, డ్రైనేజీలు ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు 22 కోట్ల రూపాయలతో పనులు అంచనాలు వేస్తున్నామని చెప్పారు.వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో లక్ష మొక్కలు నాటడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. అందుకనుగుణంగా అధికారులు పనిచేయాలన్నారు.

ఇంటింటికి మంచినీటి కొళాయి ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. పంచాయతీ పరిధిలోని పాఠశాలలను కూడా అభివృద్ధి చేస్తున్నామన్నారు. గతంలో కంటే భిన్నంగా ఇప్పుడు మధ్యాహ్న భోజనానికి సన్నబియ్యాన్ని సరఫరా చేస్తున్నట్లు వివరించారు. నాలుగు పంచాయతీల పరిధిలో ఎలాంటి సమస్య ఉన్నా.. తన దృష్టికి అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు ప్రజలు తీసుకురావచ్చని దానిపై వెంటనే పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు.

# నూతన బాధ్యతలు స్వీకరించిన ఈఓని కలిసిన పామిడి టీడీపీ నాయకులు





**పామిడి– సూర్య వాస్తవం,జూన్ 17:** పామిడి పట్టణానికి నూతన ఈఓగా వచ్చిన బాధ్యతలు స్వీకరించిన అశ్వర్థనాయుడు కు పామిడి పట్టణానికి చెందిన టీడీపీ ముఖ్య నాయకులు వారి కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాలు కప్పి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ పామిడి పట్టణాన్ని అభివృద్ధి పదంలో నడపడానికి ఈఓ కృషి చేయాలని అడిగారు ఇందుకు మా సహాయ సహకారాలు ఎల్లపుడు ఉంటాయని అందరు కలిసి కట్టుగా పామిడి పట్టణాన్ని అభివృద్ధి చేసుకుందామని తెలిపారు.ఈ కార్యక్రమం లో బొల్లు శ్రీనివాస రెడ్డి, ముసల్ రెడ్డి, బొమ్మ మోహన్, కరూరు శివ శంకర్, నల్లబోతుల శీనా, తేల్ బాషా, కొట్టం మాలిక్ బాషా,శివ అభిరామ్, పురుషోత్తం,రఘు నాథ్ రెడ్డి, అశ్వర్థ, తిమ్మప్ప, రమణ, ఓబుళకృష్ణ, సంజీవ, తదితరులు పాల్గొన్నారు.

# సిద్ధవటంలో విజృంభిస్తున్న వైరల్ జ్వరాలు

## - అప్రమత్తమైన వైద్య సిబ్బంది





**సిద్ధవటం – (సూర్యవాస్తవం),జూన్ 17:** మండల కేంద్రమైన సిద్ధవటం పోలీసు లైన్ సమీపంలోని వీధిలో వైరల్ జ్వరాలు విజృంభిస్తుండడంతో వైద్య సిబ్బంది అప్రమత్తమయ్యారు. పి. కొత్తపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ రంగలక్ష్మి, మలేరియా సబ్ యూనిట్ అధికారి ఇండ్లు సుబ్బరాయుడు ఆధ్వర్యంలో బుధవారం మలేరియా వ్యతిరేక నివారణ వారోత్సవాల గురించి ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా వారు దోమల నివారణ కొరకు ఇంటింటా స్ప్రేయింగ్ చేయించి మురుగు నీరు ఉన్న ప్రాంతాల్లో నీటిని తొలగించి బ్లీచింగ్ చల్లించారు. అంతేగాకుండా పాత టైర్లలో, కూలర్లలో నీరు నిల్వ ఉడటంతో వాటిని తొలగించి అబెట్ ద్రావణాన్ని పిచికారి చేయించారు. అనంతరం మలేరియా సబ్ యూనిట్ అధికారి సుబ్బరాయుడు మాట్లాడుతూ ఈ మలేరియా జూలై నుంచి. నవంబర్ వరకు జ్వరాలు ఎక్కువగా రావడం జరుగుతుందన్నారు. వాతావరణంలో మార్పుల కారణంగా దోమలు ఎక్కువగా అభివృద్ధి చెందుతాయన్నారు. ఆడ అనాఫిలిస్ జాతికి చెందిన దోమలు కుట్టడం వల్లమనిషికి మలేరియా జ్వరం వస్తుందన్నారు. ఈ జ్వరం చిన్నపిల్లల మీద, గర్భవతుల మీద చాలా ప్రమాదకరమైన ప్రభావం చూపుతుందన్నారు. దోమల వలన రక రకాల జ్వరాలు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఈ క్రిమీ, కీటకాల ద్వారా మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, మెదడు వాపు.బోధకాలు లాంటి జ్వరాలు వస్తాయన్నారు. కావున మీరు మీ ఇంటి చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. క్లోరినేషన్ చేసిన మంచి నీటిని తాగాలన్నారు. ప్రతి ఒక్కరూ దోమ తెరలను వాడాలన్నారు. పూల కిండీలు, పాత టైర్లు, డిస్పోజల్ గ్లాసులు, పాత డబ్బాలలో వ్యర్థాలతో కూడి మురుగు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. అలాగే వాతావరణంలో మార్పుల వల్ల వాంతులు, విరేచనాలు అయ్యే అవకాశం ఎక్కువగా ఉన్నాయన్నారు. విరేచనాలు అయితే ఓఆర్ఎస్ ద్రావనాన్ని తీసుకోవాల, పరిశుభ్రతను పాటించాలన్నారు. భోజనానికి ముందర, మలవిసర్జన తరువాత చేతులను శుభ్రంగా ఉంచుకోవాని ఆయన ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో పి. కొత్తపల్లె పిహెచ్సీ సీహెచ్ఓ లక్ష్మీనరసమ్మ, సూపర్వైజర్లు పద్మావతి, మౌలాలి, ఏఎన్ఎం శారద, ఆశా వర్కర్ ఓబులమ్మ, ప్రజలు పాల్గొన్నారు.

# కుమార్‌ను పరామర్శించిన యువనేత గుమ్మనూరు ఈశ్వర్

## -టిడిపి నాయకులకు కార్యకర్తలకు అండగా మేముంటాం గుమ్మనూరు ఈశ్వర్

**పామిడి– సూర్య వాస్తవం, జూన్ 17:**
పామిడి పట్టణానికి చెందిన విభిన్న ప్రతిభవంతుల జిల్లా అధ్యక్షులు అప్పన్నగారి కుమార్ మొన్నటి రోజున కాలుజారి కిందపడి చేతికి ఫ్రాక్చర్ అవ్వడం జరిగింది, ఈ విషయం తెలుసుకున్న గుంతకల్లు నియోజకవర్గం శాసన సభ్యులు శ్రీ. గుమ్మనూరు జయరాం తనయుడు యువనేత పామిడి,గుత్తి ఇంచార్జ్ గుమ్మనూరు ఈశ్వర్ పామిడి పట్టణం అప్పన్నగారి కుమార్ ఇంటికి వెళ్లి పరామర్శించడం జరిగింది. గుమ్మనూరు ఈశ్వర్ కుమార్ ని సంఘటన జరిగిన వివరాలు అడిగి తెలుసుకుని తొందరగా కోలుకోవాలని మీరు కోలుకోగానే మీకు ఎంత ఖర్చు అయినా సరే నా సొంత ఖర్చులతో కృత్రిమ కాలు ఇప్పించే బాధ్యత నాది అని గుమ్మనూరు ఈశ్వర్ హామీ ఇచ్చారు .ఈసందర్భంగా అప్పన్నగారి కుమార్ గుమ్మనూరు ఈశ్వర్‌కి ధన్యవాదములు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పామిడిపట్టణ, మండల కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## పాత్రికేయుల పిల్లలకు అన్ని విద్యా సంస్థల్లో

# ఫీజు రాయితీ ఇచ్చే విధంగా ప్రత్యేక చర్యలు

- నేను కూడా పాత్రికేయ కుటుంబం నుంచే వచ్చా..
- జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్
- పాత్రికేయుల సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు పెద్దపీట
- పాత్రికేయ రంగంతో మా కుటుంబానికి 40 ఏళ్ల అనుబంధం
- పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా
- వారి సమస్యలపై అసెంబ్లీ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి న్యాయం చేస్తా
- పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి



**అనంతపురం క్రైం – సూర్య వాస్తవం, జూన్ 17 :** అనంతపురం నగరంలోని టవర్ క్లాక్ వద్దనున్న ప్రెస్ క్లబ్ లో మంగళవారం ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు ఉచిత నోటు పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, ఐ.అండ్.పీఆర్ డిఐపిఆర్ఓ బాలకొండయ్య, బాలాజీ ఎడ్యుకేషన్ సొసైటీ మరియు పీవీకేకే ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ పల్లె వెంకట కృష్ణ కిషోర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు షఫీవుల్లా, జిల్లా ప్రధాన కార్యదర్శి రేపటి రామాంజనేయులు ఆధ్వర్యంలో శ్రీ బాలాజీ ఎడ్యుకేషన్ సొసైటీ సహకారంతో సుమారు 280 మంది పాత్రికేయుల పిల్లలకు ఈ ఏడాదికి విద్యకు సంబంధించిన విద్యా మెటీరియల్, నోటు పుస్తకాలు పెన్నిల్లు, ఇతర విద్యాసామాగ్రిని జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, శ్రీ బాలాజీ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ చేతుల మీదుగా అందజేశారు. ముందుగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఉరవకొండ హెచ్ఎంటీవీ పాత్రికేయుడు నాగరాజు మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించి ఆయన చిత్రపటానికి జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, తదితరులు పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పాత్రికేయుల పిల్లలకు అన్ని కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఫీజు రాయితీ ఇచ్చే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు ఉచిత నోటు పుస్తకాల పంపిణీ చేయడం పట్ల వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, బాలాజీ ఎడ్యుకేషన్ ట్రస్ట్ వారిని ప్రశంసించారు. ఇది చాలా మంచి కార్యక్రమం అని, మా నాన్నగారు కర్ణాటకలో ప్రభుత్వ ఉద్యోగిగా ఉండి రిటైర్డ్ అయ్యారని, అంతకుముందు మా నాన్న కొద్ది రోజులు చిత్రదుర్గ జిల్లా రిపోర్టర్ గా పనిచేసేవారని, కొన్ని ఆర్టికల్స్ ప్రింట్ మీడియాకు చాలా ఆలోచించి, విశ్లేషించి రాసేవారని, ఆయన రాసే న్యూస్ గురించి ఇప్పుడు కూడా గుర్తు చేసుకుంటు ఉంటానని, నన్ను కూడా మీ కుటుంబ సభ్యుడిగా పరిగణించవచ్చన్నారు.

జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రద్దు గురించి తెలియజేశారని, ఈ విషయమై లేఖ ఇచ్చిన రోజే సాయంత్రానికి ప్రొసీడింగ్స్ జారీ చేశామన్నారు. జర్నలిస్టుల గ్రీవెన్స్ ను పరిష్కరించేందుకు ఇన్చార్జిగా డిఐపిఆర్ఓ ఉంటారని, డిఐపిఆర్ఓ కార్యాలయానికి వారానికి ఒకరోజు ఒక లిఖితమైన సమయాన్ని ఇవ్వబడుతుందని, ఎలాంటి సమస్య ఉన్న లిఖితపూర్వకంగా తెలియజేయాలని, అనంతరం సమస్యలు తనకు తెలియజేయాలని, ఎంతవరకు సహాయం చేయగలుగుతామో ఖచ్చితంగా అంత సహాయం చేస్తామన్నారు. జర్నలిజం అనేది ఒక ఉత్తేజకరమైన వృత్తి అని, ఎంతో ఉత్సాహంతో ఒక జర్నలిస్ట్ వ్యాసం రాయడం మొదలు పెడతారని, ఒక జర్నలిస్టు ఒక వ్యాసం రాయాలంటే కొన్ని రోజులు ఆలోచించి, దానికోసం తిరిగి, కొందరితో మాట్లాడి అన్ని రకాల వీక్షణతో వ్యాసం రాయడం జరుగుతుందని, వారిని ఒక ఆర్టిస్ట్ తో పోల్చవచ్చన్నారు. ప్రజాస్వామ్యంలో కార్యనిర్వాహక, న్యాయవ్యవస్థ, శాసనవ్యవస్థతో పాటు జర్నలిస్ట్ నాలుగవ స్తంభం అని అన్నారు. జిల్లా యంత్రాంగం అందరు జర్నలిస్టుకి గౌరవాన్ని ఇచ్చిందన్నారు. జర్నలిస్టుల అభిప్రాయాలు చాలా విలువైనవన్నారు. జర్నలిస్టులు రాసిన వ్యాసాలకు దీర్ఘకాళిక ప్రణాళికలు రూపొందించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. జర్నలిస్టుల కుటుంబ సభ్యులకు మంచి చదువు దేవుడు అందించాలని కోరుకుంటున్నామన్నారు.పాత్రికేయుల సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు పెద్దపీట : పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

– ఈ సందర్భంగా పాత్రికేయుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పెద్దపీట వేశారని శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. శ్రీ బాలాజీ ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్ పల్లె వెంకట కృష్ణ కిషోర్ రెడ్డి సహకారంతో మంగళవారం నాడు పాత్రికేయుల సంక్షేమానికి కృషి చేయడం ఎంతో ఆనందదాయకమన్నారు. పాత్రికేయుల పిల్లలకు కొంత సహాయ సహకారాలు అందించడం అదృష్టంగా భావిస్తున్నామని, ఇది ఎంతో మంచి కార్యక్రమం అని, ఈ కార్యక్రమం నిర్వహించిన రేపటి రామాంజనేయులు, షఫీ వుల్లా , మిగతా పాత్రికేయుల సభ్యులను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. ఇంత మంచి కార్యక్రమంలో భాగస్వాములు కావడం తమకి ఎంతో



ఆనందదాయకంగా ఉందని, ఇది మంచి అవకాశంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. గత 40 ఏళ్లుగా మా మామయ్య, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి వారి ఉన్నతికి మరియు మా బాలాజీ విద్యా సంస్థల అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తున్న పాత్రికేయులకు, వారి యాజమాన్య ప్రతినిధులకు మా పల్లె కుటుంబం తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

శ్రీ బాలాజీ ఎడ్యుకేషన్ సొసైటీ మరియు పీవీకేకే ఇంజనీరింగ్ కళాశాల ద్వారా విద్యార్థులకు అందిస్తున్న విద్యారంగంతో పాటు అనేక కార్యక్రమాలను సమాజం దృష్టికి తీసుకువెళ్లడమే కాకుండా ఇటు విద్య అటు రాజకీయ పరంగా సహాయ సహకారాలు ఇస్తున్న మీడియా రంగానికి మా కుటుంబానికి ఎంతో మంచి అనుబంధ ఉందని ఎమ్మెల్యే గుర్తు చేశారు. అయితే పాత్రికేయ వృత్తిలో రాణిస్తున్న ఎంతోమంది పాత్రికేయులు ఎన్నో ఇబ్బందులతో కుటుంబాన్ని పోషించుకుంటున్నారని, అలాంటి వారి సమస్యల పరిష్కారానికి పల్లె కుటుంబం ఎల్లప్పుడూ తమ వంతు సహాయ సహకారాలు అందించడానికి కృషి చేస్తామని తెలిపారు. పాత్రికేయుల సమస్యలపైనే కాకుండా వారి సంక్షేమానికి నా వంతుగా అసెంబ్లీలో ప్రస్తావించి ప్రభుత్వం ద్వారా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. పాత్రికేయుల పిల్లల ఉన్నత విద్యకు తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. శ్రీ బాలాజీ ఎడ్యుకేషన్ సొసైటీ ద్వారా పల్లె ఉమా ట్రస్ట్ ద్వారా పాత్రికేయుల సంక్షేమానికి ఈరోజు ఎంతో కొంత ఇవ్వడం గర్వకారణంగా ఉందన్నారు. మా మామయ్య ఈరోజు విద్యావేత్తగానే కాకుండా రాజకీయ నాయకుడిగా అత్యున్నస్థాయికి ఎదిగాడంటే అందుకు పాత్రికేయుల పాత్ర ఎంతో ఉందని వారి మేలు ఎన్నటికీ మరువలేనిదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఐ.అండ్.పీఆర్ డిఐపిఆర్ఓ బాలకొండయ్య మాట్లాడుతూ జర్నలిస్టులు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య పారదర్శకంగా సమాచారం తెలియజేసే వారధన్నారు. వారి ఇచ్చే సమాచారం విశ్వసనీయత మీద ఉండాలని, ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా సహకారం జిల్లా యంత్రాంగానికి అవసరమన్నారు. ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు.ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఉరవకొండకు చెందిన హెచ్ఎంటీవీ పాత్రికేయుడు నాగరాజు పిల్లల చదువుకు అయ్యే ఖర్చును శ్రీ బాలాజీ ఎడ్యుకేషన్ సొసైటీ ద్వారా భరించి చదివిస్తామని ఆ సంస్థ చైర్మన్ పల్లె వెంకట కృష్ణ కిషోర్ రెడ్డి వెల్లడించారు. పాత్రికేయులు వేరు కాదు మేము, మీరు వేరు కాదని, మనమందరం ఒక కుటుంబ సభ్యులేనని పేర్కొన్నారు. ప్రభుత్వానికి పాత్రికేయులు ఫ్రంట్ లైన్ వారియర్స్ గా సమాజ అభివృద్ధికి పాటుపడుతున్నారని కొనియాడారు. అన్ని రంగాలను సరైన దిశగా నడిపించే శక్తిగా పాత్రికేయ రంగానికి ఉందని గుర్తు చేశారు.అంతకుముందు ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు షఫీ ప్రధాన కార్యదర్శి రేపటి రామాంజనేయులు మాట్లాడుతూ, పాత్రికేయులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. విద్యాసంస్థల్లో ఫీజు రాయితీతోపాటు ప్రభుత్వం ఇచ్చే అక్రిడేషన్లు, ఇండ్ల స్థలాలు, ఇండ్ల నిర్మాణం తదితర సమస్యలను వారి దృష్టికి తీసుకొచ్చారు. తప్పకుండా పాత్రికేయుల సంక్షేమానికి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారం కోసం కృషి చేస్తానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు %c% సీనియర్ పాత్రికేయులు ఆజాద్, రామాంజనేయులు, సంతోష్ రెడ్డి, శ్రీరాములు, పాత్రికేయ సభ్యులు 10టివి జగదీష్, అమర్, ప్రకాష్, ఆర్ కే టివి నాయుడు, కేశవ, రవి, దాదు, పలువురు పాత్రికేయులు వారి కుటుంబ సభ్యులు పిల్లలు తదితరులు పాల్గొన్నారు.



## ఎస్. రాజంపేటలో పొలం పిలుస్తోంది

### - బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం నాగరాజ




**సిద్ధవటం – సూర్యవాస్తవం,జూన్ 17:** సిద్ధవటం మండలంలోని వంతాటిపల్లె రైతుసేవా కేంద్రంలోని ఎస్. రాజంపేట గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించినట్లు బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం నాగరాజ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం నాగరాజ రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం ఆయన రైతులకు అన్నదాత సుఖీభవ పథకం అమలు గురించి వివరించారు. లూజు విత్తనాలను రైతులు ఎట్టి పరిస్థితుల్లో కొనుగోలు చేయవద్దని సూచించారు. జింక్ సల్ఫేట్, జిప్సం 50 శాతం సబ్సిడీ పై పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అలాగే ఎస్. రాజంపేటలో ప్రధాన పంట అయిన వరిలో ఉత్తమ యాజమాన్య పద్ధతులను ఆయన వివరించామన్నారు. వరి నారు నాటుటకు వారం రోజుల ముందు సెంటు విస్తీర్ణముకు 160 గ్రాములు చొప్పున కార్బోఫ్యురాన్ గుళికలు వేసుకోవాలన్నారు. రసం పీల్చు పురుగులు, ఉల్లికోడు, కాండం తొలుచు పురుగు నివారణ జరుగుతుందన్నారు. అలాగే కాలి బాటలు, నారు కొనలు తుంచి నాటడం, గట్లు వెడల్పు పెంపు, జింక్, పొటాష్ వాడకం, నత్రజని సమతుల వాడకం వంటి అంశాలపై రైతులకు వివరించడం జరిగింది. 80 శాతం సబ్సిడీ పై కిసాన్ డ్రోన్ పంపిణీ వంటి ప్రయోజనాలు వివరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కే రమేష్ రెడ్డి, రైతు సేవా కేంద్రం వ్యవసాయ సహాయకులు, ప్రేమ్ కుమార్ లు హాజరయ్యారు.

## శ్రీ వర్ష ఫుడ్ ప్రొడక్ట్స్ పరిశ్రమను సందర్శించిన

## జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి

**అన్నమయ్య బ్యూరో –సూర్య వాస్తవం, జూన్ 17:** అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరు లోని శ్రీ వర్ష ఫుడ్ ప్రొడక్ట్ పరిశ్రమలను జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కంపెనీ కెపాసిటీ, ప్రాసెసింగ్, తదితర విషయాలను పరిశ్రమ మేనేజ్మెంట్తో చర్చించారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది పడకుండా హార్టికల్చర్ అధికారులను, వీఆర్వోలను, పోలీస్ సిబ్బందిని నియమించి క్యూ మేనేజ్మెంట్,టోకెన్ సిస్టం, తదితర అంశాలపై ఫ్యాక్టరీ వారికి రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులకు ఆదేశించారు. అంతకుముందు రైల్వే కోడూరు మండల పరిధిలోని మైసూర్ వారి పల్లి గ్రామపంచాయతీలో ఉన్న మామిడికాయల యార్డ్ లో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మామిడికాయల రైతులు డీలర్ల సమన్వయ సమావేశానికి ముఖ్యఅతిథిగా అన్నమయ్య జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ.. మామిడికాయల రైతులు ఎటువంటి ఆందోళనచెందాల్సిన అవసరం లేదని ప్రభుత్వం మామిడి రైతుల యొక్క ఇబ్బందులను గుర్తించి ఫ్యాక్టరీలు ఇచ్చే ధర కాకుండా కిలోకి నాలుగు రూపాయలు చొప్పున రైతుకు ఇవ్వడం జరుగుతుందని ఈ నగదును వారి ఖాతాలోనే జమ చేయడం జరుగుతుందని తెలియజేశారు. రైతులను మోసగించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో, ఎంపీడీవో, హార్టికల్చర్, రైతులు, డీలర్లు, ఫ్యాక్టరీ యజమాన్యం తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పాలసేకరణ కేంద్రం కబ్జా

### -ఒక ప్రైవేటు వ్యక్తి వంటశాలగా మార్చిన వైనం

### -ఎవరిని అడిగి నిర్మించుకున్నారు



**హిందూపురం– సూర్య వాస్తవం, జూన్ 17:** హిందూపురం పట్టణంలోని సిపిఐ కాలనీకి దగ్గరలో ఉన్న మూతపడ్డ ప్రభుత్వ డైరీ ఒక ప్రైవేటు వ్యక్తి దర్జాగా కబ్జా చేశాడు గత ఆరు ఏడు సంవత్సరాలుగా వంటశాలగా మార్చి క్యాటరింగ్ పనులు చేస్తూ తన ఆధీనంలో తీసుకొని అది కూడా దర్జాగా 2,గదులు రెండు సెంట్లు స్థలం ఆక్రమించుకొని షెడ్డు వేసి అందులో విద్యుత్ మీటర్లు కూడా నియమించుకొని వంటకాలు వండుకుంటున్నాడు. ఇది ఉన్నతాధికారులకు తెలిసే చేస్తున్నాడా లేదా అన్నది తెలియదు కానీ ప్రభుత్వ స్థలాన్ని మాత్రం ఆక్రమించి తన సొంత లాభా లకు వాడుకుంటున్నారు. అదే ప్రభుత్వ అధికారులకు మాత్రం ఏదైనా కార్యాలయం పెట్టాలన్న వీటిని ఉపయోగించుకుండా ఇతర భవనాలు బాడుగకు తీసుకొని ప్రభుత్వ ఖజానాకు గద్ది కొడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ స్థలాల్లో అధికార పార్టీలో ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించడానికి అరికట్టి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని స్థానికుల కోరుతున్నారు.

# నన్ను ద్వేషించే వారికి కూడా కృతజ్ఞతలు : అనుపమ



ప్రముఖ నటి అనుపమ పరమేశ్వరన్ తన కెరీర్ ఆరంభంలో ఎదుర్కొన్న విమర్శలు, ట్రోల్స్ గురించి తాజాగా మనసు విప్పారు. తనను ద్వేషించిన వారికి సైతం కృతజ్ఞతలు తెలియజేస్తూ ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సినీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. మలయాళంలో తాను నటిస్తున్న 'జానకి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ' (జేవీఎస్‌కే) చిత్ర ప్రచారంలో భాగంగా ఈ ఆసక్తికర విషయాలను వెల్లడించారు. ప్రవీణ్ నారాయణన్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ థ్రిల్లర్ చిత్రంలో సురేశ్ గోపి కీలకపాత్ర పోషిస్తున్నారు. జూన్ 27న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రంతో మలయాళ ప్రేక్షకులను తప్పకుండా ఆకట్టుకుంటానని అనుపమ ధీమా వ్యక్తం చేశారు.

తెలుగులో 'ప్రేమమ్', 'అ ఆ', 'శతమానం భవతి' వంటి విజయవంతమైన చిత్రాలతో ప్రేక్షకులకు చేరువైనప్పటికీ, కెరీర్ తొలినాళ్లలో తనకు నటన రాదంటూ పలువురు తీవ్రంగా ట్రోల్ చేశారని అనుపమ గుర్తుచేసుకున్నారు. ఆ మాటలు మొదట్లో బాధపెట్టినా, అవే తనలో పట్టుదల పెంచాయని, నటిగా తనను తాను నిరూపించుకోవాలనే కసిని రగిలించాయని ఆమె పేర్కొన్నారు. ముఖ్యంగా కొవిడ్ సమయంలో కెరీర్‌పరంగా, వ్యక్తిగతంగా అనేక సవాళ్లను ఎదుర్కొన్నట్లు తెలిపారు.

అయితే, ఈ విమర్శలే తనను తాను మెరుగుపరుచుకోవడానికి, మంచి కథలను ఎంచుకోవడంలో మరింత జాగ్రత్త వహించడానికి దోహదపడ్డాయని అనుపమ వివరించారు. విమర్శల ఫలితంగా తన ఆలోచనా దృక్పథంలో మార్పు వచ్చిందని, ప్రేక్షకులను మెప్పించే బలమైన కథలను మాత్రమే ఎంచుకోవాలని నిశ్చయించుకున్నానని చెప్పారు. ఈ క్రమంలోనే దర్శకుడు ప్రవీణ్ నారాయణన్ తనపై నమ్మకముంచి 'జానకి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ' (జేవీఎస్‌కే) వంటి అద్భుతమైన చిత్రంలో అవకాశం కల్పించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా, తనకు మద్దతుగా నిలిచినవారితో పాటు, తనను ద్వేషించిన వారికి కూడా కృతజ్ఞతలు తెలుపుతున్నానని, వారి విమర్శలే తనను మరింత దృఢంగా తీర్చిదిద్దాయని అనుపమ వ్యాఖ్యానించారు.

# "తమ్ముడు" నుంచి ఫస్ట్ లిరికల్ సాంగ్

## 'భూ అంటూ భూతం..' రిలీజ్

ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ నిర్మాణంలో నితిన్ హీరోగా శ్రీరామ్ వేణు దర్శకత్వంలో రూపొందుతున్న ప్రెస్టీజియస్ మూవీ "తమ్ముడు". దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో లయ, వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ కీలక పాత్రలు పోషిస్తున్నారు. జూలై 4న "తమ్ముడు" సినిమా వరల్డ్ వైడ్ గా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. మంగళవారం ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ 'భూ అంటూ భూతం..' రిలీజ్ చేశారు. మేనకోడలు బేబి దిత్యకు మేనమామ నితిన్ ధైర్యం చెప్పే సందర్భంలో ఈ పాటను చిత్రీకరించారు. 'భూ అంటూ భూతం..' పాటను అజనీష్ లోకనాథ్ బ్యూటిఫుల్ గా కంపోజ్ చేయగా, అనురాగ్ కులకర్ణి, అక్షిత పోల ఆకట్టుకునేలా పాడారు. సింహాచలం మన్నేలా లిరిక్స్ రాశారు. 'భూ అంటూ భూతం..' పాట ఎలా ఉందో చూస్తే – 'భూ అంటూ భూతం వస్తే ఆగకే అమ్మాడీ, భూ మంత్రం వేసి దాంతో బొమ్మలాటలాడాలి. భూ అంటూ భూతం వస్తే ఆగకే అమ్మాడీ, భూ




మంత్రం వేసి దాంతో బొమ్మలాటలాడాలి..పుట్టగానే నేరుగా నువ్వు పరుగెత్తలే, పట్టుకుంటూ పడుతూ నడకేనేర్చావే, భయపడి అడుగు ఆపకే..అంటూ సాగుతుంది పాట.

## పూరీ చిత్రంలో సంయుక్త



పూరీ జగన్నాథ్, విజయ్ సేతుపతి కాంబోలో ఓ చిత్రం రాబోతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో నటిస్తున్న మరో నటిని తాజాగా చిత్రబృందం ప్రకటించింది. మలయాళ నటి సంయుక్త.. ఈ ప్రాజెక్ట్‌లోకి రానున్నట్లు పూరీ–ఛార్మీ ప్రకటించారు. ఆమెతో కలిసున్న ఫొటోని సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. విజరు సేతుపతి మూవీలో ఇప్పటికే టబు, కన్నడ నటుడు దునియా విజరు ఉన్నట్లు గతంలో ప్రకటించారు. ఈ చిత్రంలో సేతుపతి బిచ్చగాడిగా కనిపించనున్నాడని తెలుస్తోంది. త్వరలో షూటింగ్ ప్రారంభించి ఈ ఏడాది చివర్లోనే రిలీజ్ చేయాలనే ప్లాన్ చేస్తున్నారని సమాచారం.

## 'సన్ ఆఫ్ సర్దార్'లో మృణాల్




బాలీవుడ్ నటుడు అజయ్‌దేవ్‌గణ్ చిత్రంలో మృణాల్ ఠాకూర్ నటిస్తున్నారు. హిట్ మూవీ సీక్వెల్‌గా తెరకెక్కుతున్న 'సన్ ఆఫ్ సర్దార్–2'లో తాను నటిస్తున్నట్లు తాజాగా ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఆమె వెల్లడించారు. క్లాప్ కొడుతున్న ఫొటోని షేర్ చేశారు. ఈ చిత్రంలో అజరు దేవ్‌గణ్ ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. విజరు కుమార్ అరోరా ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. దేవ్‌గణ్ ఫిల్మ్స్, జియో స్టూడియోస్ బ్యానర్‌పై జ్యోతి దేశ్‌పాండే, అజరు నిర్మిస్తున్నారు. యాక్షన్ కామెడీ నేపథ్యంలో రాబోతున్న ఈ మూవీలో సంజరు దత్, సాహిల్ మెహతా, సంజరు మిశ్రా, రవికృష్ణ కీలక పాత్రలో కనిపించనున్నారు. షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ సినిమా జులై 25న విడుదల కాబోతున్నట్లు సమాచారం.





# టాప్‌లోకి మంధాన

అంత ర్జాతీయ క్రికెట్ మండ లి(ఐసిసి) తాజాగా ప్రక టించిన మహిళల వన్డే బ్యాటర్ల జాబితాలో భారత సంచలనం స్మృతి మంధాన సత్తా చాటింది. ఇప్పటివరకు 2వ ర్యాంక్‌లో ఉన్న మంధాన.. ఐసిసి మంగళవారం ప్రకటించిన ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి ఎగబాకింది. ఎడమచేతి వాటం ప్లేయర్ అయిన మంధాన 727 రేటింగ్ పాయింట్లతో టాప్ ప్లేస్‌లో ఉంది. 2019 తర్వాత భారత వైస్ కెప్టెన్ మంధాన మళ్లీ ర్యాంకుల్లో ప్రథమ స్థానాన్ని ఆక్రమిం చింది. దక్షిణాఫ్రికా కెప్టెన్ లౌరా వోల్వార్డ్.. ఇటీవల 19 పాయింట్లు కోల్పోయింది. దీంతో మంధాన టాప్ వన్ నెంబర్ దిశగా దూసుకెళ్లింది. ఇంగ్లండ్ కెప్టెన్ నటాలీ స్కీవర్ బ్రంట్ 719 పాయింట్లతో రెండో ర్యాంక్‌లో ఉంది. వోల్వార్డ్ 719 పాయింట్లతో మూడవ స్థానంలో ఉన్నారు.

# షాంటో, ముష్ఫికర్ సెంచరీలు.. బంగ్లాదేశ్ 292/3

**గాలే:** శ్రీలంకతో జరుగుతున్న తొలి టెస్టులో బంగ్లాదేశ్ బ్యాటర్లు ముష్ఫికర్, నజ్ముల్ హొసైన్ షాంటో సెంచరీలతో కదం తొక్కారు. అయితే టాస్ గెలిచి బ్యాటింగ్‌కు బంగ్లాదేశ్‌కు శుభారంభం దక్కలేదు. ఇనాముల్ హక్(0), షాద్మా న్(14), మోమినుల్ హక్(29) నిరాశపరిచారు. దీంతో బంగ్లాజట్టు 45పరుగులకే 3వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ దశలో బంగ్లా కెప్టెన్ నజ్ముల్ హుస్సేన్ శాంటో(136 బ్యాటింగ్), వికెట్ కీపర్ బ్యాటర్ ముష్ఫికర్ రహీం(105 బ్యాటింగ్) అద్భుత సెంచరీలతో జట్టును ఆదుకున్నారు. వీరిద్దరూ నాలుగో వికెట్‌కు 247 పరుగుల ఆజేయ భాగస్వామ్యం నెలకొల్పారు. వీరిద్దరి జోడీని విడదీసేందుకు శ్రీలంక బౌలర్లు ఎంత ప్రయత్నించినా ఈ భాగస్వామ్యాన్ని బ్రేక్ చేయలేకపోయారు. దీంతో బంగ్లాదేశ్ జట్టు మొదటి రోజు ఆటముగిసే సమయానికి మూడు వికెట్లు కోల్పోయి 292 పరుగులు చేసి పటిష్ట స్థితిలో నిలిచింది. క్రీజులో బంగ్లా కెప్టెన్, వికెట్ కీపర్ ముష్ఫికర్ రహీం ఉన్నారు. శ్రీలంక బౌలర్లలో రత్నాయకే రెండు, ఫెర్నాండో ఒక వికెట్ దక్కాయి. 2



## వరల్డ్ కప్ తర్వాత వన్డేలకు సోఫీ డివైన్ గుడ్‌బై



**క్రైస్ట్‌చర్చ్:** న్యూజి లాండ్ కెప్టెన్ సోఫీ డెవైన్ షాకింగ్ నిర్ణయం తీసు కుంది. టి20 ప్రపంచకప్ ను అందిం చిన న్యూజి లాండ్ కెప్టెన్ వన్డేలకు అల్విదా చెప్పనుంది. ఈ ఏడాది సెప్టెంబర్‌లో జరిగే వన్డే ప్రపంచ కప్ తర్వాత వన్డే ఫార్మాట్ నుంచి వైదొలగ నున్నట్లు ప్రకటించింది. ఈ విషయాన్ని ఆమె మంగళవారం సామాజిక మాధ్యమం ద్వారా వెల్లడించింది. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న మహిళల వన్డే వరల్డ్ కప్ సెప్టెంబర్ 30 నుంచి జరగనుంది. అక్టోబర్ 1న ఇండోర్‌లో ఆస్ట్రేలియాతో కివీస్ తలపడనుంది. 11వ నంబర్ ప్లేయర్‌గా వన్డేల్లో అరంగేట్రం చేసిన సోఫీ.. జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించింది. 2020లో కెప్టెన్‌గా పగ్గాలు అందుకున్న డివైన్.. వెటరన్ సుజీ బేట్స్ తర్వాత కివీస్ తరఫున అత్యధికంగా 152 మ్యాచులు ఆడింది. ఇందులో 8 సెంచరీలు, 16 అర్ధ సెంచరీ లు ఉన్నాయి. అలాగే 3,990 పరుగులతోపాటు 107 వికెట్లు పడగొట్టింది.

## టీ20 చరిత్రలో తొలిసారి..

### - మూడు సూపర్ ఓవర్లతో తేలిన ఫలితం



టీ20 చరిత్రలో తొలిసారి మూడు సూపర్ ఓవర్లతో తేలిన ఫలితం తేలింది. ఈ మ్యాచ్ నేపాల్, నెదర్లాండ్స్ మధ్య జరిగింది. అంతర్జాతీయ టీ20లో మూడుసార్లు సూపర్ ఓవర్ జరగడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. తొలుత బ్యాటింగ్ చేసిన నెదర్లాండ్స్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 152 పరుగులు చేసింది. ఆ తర్వాత ఛేదనలో నేపాల్ స్కోరును (152/8) సమం చేసింది. మ్యాచ్ టై అవడంతో సూపర్ ఓవర్ నిర్వహించారు. తొలి సూపర్ ఓవర్‌లో ఇరు జట్లూ 19 పరుగులు చేయడంతో రెండోసారి టైబ్రేకర్ ఆడించారు. అందులోనూ రెండు జట్లూ చెరో 17 పరుగులు చేశాయి. దీంతో ఫలితం తేలడం కోసం మూడోసారి సూపర్ ఓవర్ నిర్వహించారు. అందులో నెదర్లాండ్స్ బౌలర్ జాచ్ లయన్–కాచెట్ నేపాల్‌కు ఒక్క పరుగు కూడా ఇవ్వకుండా.. నాలుగు బంతుల్లో రెండు వికెట్లు తీశాడు. దీంతో నెదర్లాండ్స్ లక్ష్యం ఒక్క పరుగుగా మారింది. ఛేదనకు దిగిన నెదర్లాండ్స్ జట్టు ఒక్క బంతికే సిక్స్ కొట్టి విజయం సాధించింది.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య

### - ఎమ్మెల్యే పరిటాల సునీత



**రాప్తాడు -సూర్య వాస్తవం:** ప్రైవేటు పాఠశాలల కన్నా ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందుతుందని ఎమ్మెల్యే పరిటాల సునీత తెలియజేశారు.రాప్తాడు మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా మిత్ర పాఠశాల కిట్లు పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.పాఠశాలకు వచ్చిన ఎమ్మెల్యే సునీతకు విద్యా ర్థులు ఉపాధ్యాయులు ఘనస్వాగతం పలికారు. ఎమ్మెల్యే ఉపాధ్యాయులు కలిసి సర్వేపల్లి రాధాకృష్ణన్,సరస్వతి దేవి విగ్రహాలకు పూలమాలలు వేశారు.అనంతరం తల్లికి వందనం పథకం కింద విద్యార్థులకు రూ.15,000 ఆర్థిక సాయం అందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఎమ్మెల్యే విద్యార్థులతో మాట్లాడుతూ పాఠశాలలో ఎలాంటి సౌకర్యాల ఉన్నాయని ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ పాఠశాలంటే దేవాలయాలతో సమానమన్నారు.రాప్తాడు మండలంలోనే సుమారు 3వేల మంది విద్యార్థిని విద్యార్థులకు విద్యా మిత్ర కిట్లు పంపిణీ చేశామన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా 36లక్షల మందికి విద్యా మిత్ర కిట్లు అందజేసేందుకు రూ.950కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు.అలాగే తల్లికి వందనం కింద రాప్తాడు మండలంలో 5వేల మందికి రూ.6 కోట్ల 50 లక్షలు అందిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 68లక్షల మందిని గుర్తించి రూ.8,800 కోట్లు మంజూరు చేశామన్నారు. తొలివిడత 55లక్షల మందికి రూ.7,200 కోట్ల వరకు విడుదల చేసినట్లు వివరించారు.పేదల విద్య విషయంలో ఎక్కడా రాజీ పడటం లేదన్నారు.దీనిని దృష్టిలో ఉంచుకొని విద్యార్థులు కూడా చక్కగా చదువుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంఈఓ మల్లికార్జున పీఈటి కేశవ మూర్తి తాసిల్దార్ విజయకుమారి ఎంపీడీవో విజయలక్ష్మి మండల కన్వీనర్ పంపుకొండప్ప కార్యదర్శి శ్రీనివాసులు మార్కెట్ డైరెక్టర్ రామాంజినమ్మ మాజీ కన్వీనర్ నారాయణస్వామి విద్యార్థిని విద్యార్థులు టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## యోగాతో మంచి ఆరోగ్యం: ఎమ్మెల్యే సునీత




**రాప్తాడు - సూర్య వాస్తవం :** ప్రతిరోజు యోగా చేస్తే ఎంత ఆరోగ్యంగా ఉంటారో చెప్పడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిలువెత్తు నిదర్శనమని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు.రాప్తాడు మండల కేంద్రంలోని పండమేరు వెంకటరమణ స్వామి దేవస్థానం ఆవరణం నందు పార్క్ లో యోగాంధ్ర-2025 కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు,మహిళలతో కలసి యోగా చేశారు. యోగా మాస్టర్స్ సూచించిన విధంగా ఆసనాలు వేస్తూ అందరిలో స్ఫూర్తి నింపారు.ఈ సంధర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ యోగా అనేది మనిషికి ఎంత అవసరమో అందరూ తెలుసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు యోగాంధ్ర కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారన్నారు.గత నెల 21వ తేది నుంచి ఈనెల 21వ తేది వరకు రాష్ట్రంలో పెద్ద ఎత్తున యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 2 కోట్ల మంది పాల్గొనేలా కార్యాచరణ రూపొందించారు.ఈనెల 21న వైజాగ్ లో 5లక్షల మందితో పెద్ద ఎత్తున యోగా కార్యక్రమాన్ని నిర్వహించి వరల్డ్ రికార్డ్ సాధించేలా చేస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి మోడీ కూడా పాల్గొంటున్నారు. యోగా అనేది అన్ని వయసుల వారికి చాలా అవసరమన్నారు.యోగా సాధన చేయడం వల్ల ఒత్తిడి తగ్గి ఏకాగ్రత పెరుగుతుందన్నారు.బీపీ షుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులు కూడా తగ్గే అవకాశం ఉందన్నారు. అందుకే ప్రతి ఒక్కరు దైనందిన జీవితంలో యోగాను అలవాటుగా మార్చుకోవాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో తాసిల్దార్ విజయ్ కుమారి ఎంపీడీవో విజయలక్ష్మి హౌసింగ్ ఏఈ లావణ్య ఎంఈఓ మల్లికార్జున పి ఈ టి కేశవమూర్తి మండల కన్వీనర్ పంపు కొండప్ప కార్యదర్శి దగ్గుపాటి శ్రీనివాసులు మార్కెట్ డైరెక్టర్లు కృష్ణ రామంజి నమ్మ మాజీ కన్వీనర్ నారాయణస్వామి ఉపాధ్యాయులు విద్యార్థులు ప్రజలు పాల్గొన్నారు.

## అంగన్వాడీల్లోనే బాలల వికాసం

### - అనంతపురం అర్బన్ సీడీపీఓ అనూరాధ

**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, జూన్ 17:** చిన్నారుల వికాసం అంగన్వాడీ కేంద్రాల్లోనే సాధ్యమని అనంతపురం అర్బన్ సీడీపీఓ అనూరాధ అన్నారు. అనంతపురం నవోదయ కాలనీలోని అంగన్వాడీ కేంద్రాలను మంగళవారం ఆమె సందర్శించారు. అంగన్వాడీ కేంద్రాల చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. మూడు సంవత్సరాల వయస్సు నిండిన పిల్లలను అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించి, వారి ఉజ్వల భవితకు తలిదండ్రులు దోహదపడాలని కోరుతూ ర్యాలీ నిర్వహించారు. ఆరేళ్లు నిండిన పిల్లలకు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చేర్పించేందుకు హెడ్మాస్టర్ తో మాట్లాడారు. అంగన్వాడీ కేంద్రాల్లో లభించే పౌష్టికాహారం, ఇతర సేవల గురించి కూడా వివరించారు. అనంతరం మెనూ ప్రకారం భోజనం వడ్డించారు లేదా అని ఆరా తీశారు. వండిన భోజన పదార్థాలు తిని, వాటి రుచి చూసారు. విధిగా పిల్లల బరువు తీయాలని, ఎత్తుకు తగ్గ బరువు ఉండేలా చూడాలని సూచించారు. టీ. హెచ్.ఆర్ ఎంత మందికి ఇచ్చారని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు హేమలత, విజయలక్ష్మి, మహిళా పోలీస్ దివ్య అంగన్వాడీ టీచర్లు కమల, మాధవి, అనసూయ, విక్టోరియా పాల్గొన్నారు.




# అనంత ఆణిముత్యం ప్రభాకర్ జీ

**పామిడి- సూర్య వాస్తవం, జూన్ 17:**

అనంతపురం జిల్లా పామిడి గ్రామానికి దగ్గర ఉండే పోతురాయి అనే గ్రామం నేడు కేశవాపురం. ఈ గ్రామానికి చెందిన వ్యక్తి ప్రభాకర్ జీ. ఆయన అనాథ బిడ్డడు, కనుక జన్మతేదీవివరాలు, కులమతాలు దాదాపు తెలియదు. దళితవాడలోని మాల చిదంబరప్ప, సుబ్బమ్మ దంపతులకు ఈ బిడ్డను సాకి జోసెఫ్ అని నామకరణం చేశారు. దురదృష్టవశాత్తు చిదంబర్ కన్నుమూయగా, జోసెఫ్ మొత్తం బాధ్యత సుబ్బమ్మ మీద పడింది. ఆమె కుమారుడి భవిష్యత్తు కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో ఆయాగా చేరింది. తన తల్లి గురించి జోసెఫ్ తర్వాత కాలంలో ఇలా రాసుకున్నారు: "మా అమ్మ నన్ను చూసి చాలా విచార పడుతూ ఉండేది. నా మాట వినరా జోసెపూ అంటూ జాలి గొలుపేటట్లు బ్రతిమాలుతూ ఉండేది. కానీ నేను తోటి విద్యార్థులతో కలిసి అల్లరి చేసే వాడిని. అందులో ఇద్దరితో నాకు చాలా ఆత్మీయత ఏర్పడింది, వారి పేర్లతో నా పేరు జోడించుకొని 'జోసెఫ్ మోహన ప్రభాకరం' అని నా పేరు రాసుకునే వాడిని." హైస్కూలు విద్యార్థిగా ఉన్నప్పుడు ఫుట్బాల్, హాకీ, బ్యాడ్మింటన్ వంటి ఆటలలో నైపుణ్యం సంపాదించుకున్నాడు. గ్రిగ్ మెమోరియల్ పోటీలలో బహుమతులు పొందారు. ఆటల పోటీల్లో పాల్గొనడానికి 40, 50 మైళ్ళు సైకిల్ మీద వెళ్లేవాడు. అలాగే నాటకాలలో వేషాలు కట్టి ఆంజనేయుడుగా రాణించాడు. ఆయన సహ విద్యార్థులలో సంగీత విద్వాంసులు సంధ్యావందనం శ్రీనివాస రావు, ప్రముఖ కవి సంపత్ రాఘవాచార్యులు, స్వాతంత్ర్య సమరయోధులు రచయిత గుత్తి రామకృష్ణ మొదలైన వారు ప్రముఖులు. సెకండ్ ఫార్మ్ చదివే టప్పుడు నాన్-డీటెయిల్డ్ వాచకంలో బుద్ధుని గురించి చదివి ప్రభావితుడయ్యాడు. అదే సమయంలో అప్పటి ప్రముఖ నాయకులు కల్లూరు సుబ్బారావు బందరు ఆంధ్ర జాతీయ కళాశాలను ప్రశంసిస్తుంటే అక్కడ చదవాలనే కోరిక కలిగింది. పరీక్ష పత్రాలున్న గదికి నిప్పు పెట్టి, ఆ కేసు విచారిస్తున్న పోలీసు అధికారి పై హత్యాయత్నం చేసిన చరిత్ర గల జోసెఫ్ ఈ సందర్భంలో పరివర్తనకు లోనై, తన మిత్రుడు గుత్తి రామకృష్ణ చదువుతున్న ఆంధ్ర జాతీయ కళాశాలలో చదవాలని కోరిక కలిగింది.





1936 ప్రాంతంలో జోసెఫ్ ఎవరికి చెప్పకుండా అనంతపురం నుంచి కాలినడకన, రైలు దారి గుండా మద్రాసు వైపు బయలుదేరారు. మర్నాడు బిట్రగుంట చేరాడు, రైల్వే ప్లేగ్రౌండ్ లో ఆంగ్లో ఇండియన్ జట్టు ఆడుతున్న ఫుట్బాల్ ఆటలో పాల్గొన్నాడు. మర్నాడు అదే బాట పట్టి ప్రయాణిస్తూ ఓ అడవి చేరాడు. బాగా ఆకలి వేసింది, ఒక సాధువు జోసెఫ్ ను పిలిచి తన అన్నం గిన్నె ఇచ్చి తినమన్నాడు. ఆ గిన్నెలో మూడున్నరణాలు కూడా ఉన్నాయి. టికెట్ లేకుండా బెజవాడ దాకా రైలులో ప్రయాణం చేసిన జోసెఫ్, తర్వాత కాలినడకన బందరు చేరాడు.

తన మిత్రుడు గుత్తి రామకృష్ణను కలిసి, ఆంధ్ర జాతీయ కళాశాలలో చేరే అవకాశాన్ని కల్పించమని కోరాడు. ఆ మిత్రుడు తిన్నగా జోసెఫ్ ను కళాశాల ప్రిన్సిపల్, చిత్రకారుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన అడవి బాపిరాజు దగ్గరకు తీసుకు వెళ్ళాడు. జోసెఫ్ చాలా నిజాయితీగా తన తుంటరి పనులు, తప్పిదాలను దాచుకోకుండా విప్పి చెప్పిబీ ఇప్పుడు పరివర్తన కలిగిందని, కళాశాలలో చేరాలనే కోరిక బలంగా ఉందని వేడుకున్నాడు. జోసెఫ్ నిజాయితీ, పట్టుదల, పశ్చాత్తాపం గుర్తించి విశ్వసించిన అడవి బాపిరాజు మహాశయుడికి హృదయం ద్రవించి, జోసెఫ్ ను కళాశాలలో చేర్చుకున్నాడు. మొదటి నుంచి జోసెఫ్ బాపిరాజుకు ఆత్మీయంగా మారడంతో ఒక చిన్న మార్పు చేశారు. జోసెఫ్ ప్రభాకర మోహనం అని పేరు నుంచి 'ప్రభాకర్' అని మాత్రమే స్థిరపరిచారు. ఆ పూర్వనామం తో తన ఇంటికి వస్తే తల్లి అభ్యంతరం చెప్పవచ్చని బాపిరాజు ఆ మార్పు చేశారు. అడవి బాపిరాజు తల్లికి సంబంధించిన ఒక గొప్ప సంఘటన గురించి మనం చెప్పుకోవాలి. ప్రభాకర్ కు ఒకసారి తీవ్రమైన స్థాయిలో జ్వరం వచ్చింది, మూసిన కన్ను తెరవకుండా హాస్టల్ గదిలో పడి ఉన్నాడు. బాపిరాజు తల్లికి ఈ విషయం తెలిసి, తలపోటు మందు తీసుకొని గబగబా హాస్టల్ రూముకి వచ్చి, అతని తలకు పట్టించి ప్రేమతో ఒళ్లంతా నిమిరి, జ్వరం నెమ్మదించేదాకా ఉండి వెళ్ళింది. కాసేపటికి ఆ కళాశాలలో ఖాదీ మాస్టర్ గా పనిచేసే శ్రీ సూర్యనారాయణ వచ్చినప్పుడు బాపిరాజు తల్లి అనంతపురం కుర్రాడు ప్రభాకర్ వచ్చిన జ్వరం గురించి చెప్పి బాధపడింది. అతనికి అర్థం కాకపోతే అనంతపురం నుంచి వచ్చిన పొట్టిగా, తెల్లగా ఉన్న కుర్రాడని ఆమె వివరించింది. అతను ప్రభాకర్ కాదు, జోసెఫ్ అని వివరాలు తెలిసినప్పుడు ఆ తల్లి చింతించడం ప్రారంభించింది. తర్వాత ఆమె కుమారుడు బాపిరాజు వచ్చి, ఆమె విశ్వసించే ధర్మసూత్రాలకు అంటరానితనం అనేది ఏ రకంగా విరుద్ధమో నచ్చజెప్పి, ఆమెను సముదాయించారు. అప్పటి నుంచి ప్రభాకర్ అడవి బాపిరాజు ఇంట్లో మనిషై పోయాడు, ఆ తల్లి అమితమైన మమతాను రాగాలు పొందారు. ఈ రకంగా అడవి బాపిరాజు ఇంట్లో అంటరానితనాన్ని రూపుమాపిన వ్యక్తి జోసెఫ్ లేదా ప్రభాకర్ జీ.

**ఎప్పుడూ ఉదయించడమే కానీ ఎన్నడూ అస్తమించడం ఎరుగని**
**సర్వోదయ ప్రభాకరుడు**
**స్వసుఖం బొత్తిగా కోరనివాడు**
**పరసుఖమునకై పాటుపడిన వాడు**
**బాధితుల సేవకు తాను అంకితమై**
**ప్రజలకు త్యాగమార్గం చూపినవాడు..."**

అని దాశరథి కృష్ణమాచార్య చేత ప్రస్తుతింపబడిన ప్రభాకర్ జీ తెలుగు వారిలో గాంధీజీకి అత్యంత సన్నిహితంగా గడిపిన వారిలో ప్రథములు, పదహారణాల గాంధీ అనుయాయి. గాంధీజీకి తైలమర్దన చేయడం, ప్రకృతి చికిత్స కార్యక్రమాలలో సహకరించడం, ఉదయ సాయంకాలాల్లో ఆశ్రమంలో ప్రార్థనలు నిర్వహించడం, ఆశ్రమానికి వచ్చే పెద్దలకు గాంధీజీ ఇంటర్వ్యూలు ఏర్పాటు చేయడం. ఆసుపత్రిలో పనిచేయడం ఇది వార్ధా సేవాశ్రమంలో ప్రభాకర్ జీ నిర్వహించిన పనులు. 1947 అక్టోబర్ 2వ తేదీన తాను చదివిన అనంతపురం హైస్కూల్ అధ్యాపకులు, విద్యార్థులు ప్రభాకర్ జీని అతిథిగా ఆహ్వానించారు. ఆనాటి కార్యక్రమం గురించి అప్పటి 'శ్రీ సాధన పత్రిక' ఈ రకంగా వార్తను ప్రచురించింది: "ఉదయం జాతీయ జెండా అభివందనం ముగిసిన వెనుక, ప్రభాకర్ జీ విద్యార్థి బృందాన్ని బాలబాలికలను వెంటబెట్టుకుని పాత ఊరిలో వీధి వీధిలో మురుగు దొడ్లను ఊడ్చి ఊడ్పించినాడు. మున్సిపల్ మేస్త్రీలు అంత చక్కగా పనిచేసే ఉండలేదు..." దివిసీమలో 1977 నవంబర్ 19న సంభవించిన మహాప్రళయం వంటి ఉప్పెన చేసిన అతలాకుతల పరిస్థితులను సరిదిద్దుతూ, ఆ సేవా కార్యక్రమాల్లో ఉంటూ జూన్ 18న తనువర్పించిన ఆధునిక కాలపు మహర్షి ప్రభాకర్ జీ. ఈ మహనీయుడి గుర్తింపుగా అనంతపురం పాతూరు లో ప్రభాకర్ స్ట్రీట్, మున్సిపల్ స్కూల్ ఏర్పాటు చేశారు. అలాగే దివిసీమలో చింత కోళ్ల దిన్నె అనే గ్రామానికి ప్రభాకర పురం అని నామకరణం చేశారు. ప్రభాకర్ జీ వర్ధంతి సందర్భంగా అనంతపురం జిల్లా వాస్తవ్యులు గాంధేయవాది డా . నాగసూరి వేణుగోపాల్, కాంగ్రెస్ సేవాదళ్ సోషియల్ మీడియా సమన్వయకర్త డా . ముచ్చుకోట సురేష్ బాబు, పౌర స్పందన వేదిక రాష్ట్ర నాయకులు డా. జి. వెంకటశివారెడ్డి, డా ప్రణయనాథ్ రెడ్డి శివరాంపల్లిలో ప్రభాకర్ ఘాట్ వద్ద నివాళు లర్పించారు.

# ఏపీలో నియోజకవర్గాల పునర్విభజనకు లైన్‌క్లియర్ !

**అమరావతి - సూర్య వాస్తవం**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మొత్తం శాసనసభ స్థానాలు 175 నుంచి 225కు పెంపునకు మార్గం సుగమమైంది. ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్థానాలు 175 నుంచి 225కు, తెలంగాణ శాసనసభ స్థానాలు 119 నుంచి 134కు పెంపునకు మార్గం సుగమమైంది.దేశంలో జనగణన చేపట్టడానికి అనుమతిస్తూ సోమవారం కేంద్రం గెజిట్ నోటీఫికేషన్ జారీ చేసింది. జన గణన వచ్చే ఏడాది పూర్తి కానుంది. కొత్త జనాభా లెక్కల ఆధారంగా దేశ వ్యాప్తంగా లోక్‌సభ స్థానాలు, శాసనసభ స్థానాల పునర్విభజన ప్రక్రియను ఎన్నికల సంఘం చేపట్ట నుంది. ఇందులో భాగంగానే ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో శాసనసభ స్థానాలను పెంచుతూ నియోజక వర్గాల పునర్వి భజన చేపట్టనుంది.రాష్ట్ర విభజన జరిగిన 11 ఏళ్ల తర్వాత రెండు రాష్ట్రాల శాసన సభల్లో స్థానాల పెంపునకు లైన్ క్లియర్ కావడం గమనార్హం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని విభజిస్తూ 2014, మార్చి 1న ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం-2014ను కేంద్రం జారీ చేసింది. దీంతో 2014, జూన్ 2న తెలంగాణ కొత్త రాష్ట్రంగా ఆవిర్భవించింది. రాజ్యాంగం లోని 170వ అధికరణలోని సెక్షన్-15 ప్రకారం శాసనసభ స్థానాలను ఆంధ్రప్రదేశ్‌లో 175 నుంచి 225కు, తెలంగాణలో 119 నుంచి 134కు పెంచుతూ నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాలని విభజన చట్టం-2014లో సెక్షన్-26(1) ద్వారా ఎన్నికల సంఘానికి కేంద్రం నిర్దేశించింది. విభజన చట్టం ప్రకారం 2019 నాటికే రెండు రాష్ట్రాల్లో శాసనసభ స్థానాలను



పెంచుతూ నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను ఎన్నికల సంఘం, కేంద్రం పూర్తి చేస్తాయని రాజకీయపార్టీలు ఆశిస్తూ వచ్చాయి. కానీ ఆ ఆశలు అడియాసలయ్యాయి.

జన గణనతో ముడిపెట్టిన కేంద్రం జమ్మూ కశ్మీర్‌లో శాసనసభ స్థానాల పునర్విభజనకు 2022, మే 5న కమిషన్‌ను ఏర్పాటుచేస్తూ కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నేపథ్యంలో విభజన చట్టం ప్రకారం ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లోనూ శాసనసభ స్థానాలను పెంచేలా కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరుతూ సుప్రీం కోర్టులో కె.పురుషోత్తం రెడ్డి రిట్ పిటిషన్ దాఖలు చేశారు. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కోటీశ్వర్ సింగ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో శాసనసభ స్థానాలను పెంచుతూ నియోజకవర్గాల పునర్విభజన చేపట్టడంపై కేంద్రం అభిప్రాయాన్ని సుప్రీం కోర్టు కోరింది. దేశంలో జన గణన ప్రక్రియ 2026లో పూర్తవుతుందని,ఆ తర్వాతే విభజన చట్టంలో సెక్షన్-26(1) ప్రకారం ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో శాసనసభ స్థానాల పెంపునకు నియోజకవర్గాల పునర్విభజన చేపడతామని స్పష్టం చేస్తూ అడిషనల్ సొలిసిటర్ జనరల్ కేఎం నటరాజ్ సుప్రీంకోర్టుకు స్పష్టం చేశారు. ఈ పిటిషన్‌పై తీర్పును ఏప్రిల్ 30న సుప్రీం కోర్టు ద్విసభ్య ధర్మాసనం రిజర్వు చేసింది.ప్రజల సౌకర్యం పాలన సౌలభ్యమే ప్రాతిపదికగా: జన గణన ఆధారంగానే నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాలన్న అంశం ఏపీ విభజన చట్టంలో ఎక్కడా లేదు. ప్రజల సౌకర్యం, పాలన సౌలభ్యం, భౌగోళికంగా సమస్యలు తలెత్తకుండా శాసనసభ స్థానాలను పెంచుతూ నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాలని మాత్రమే ఎన్నికల సంఘానికి విభజన చట్టం నిర్దేశించింది.

కానీ కేంద్రం జన గణనతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో శాసనసభ స్థానాల పునర్వి భజన ను ముడిపెట్టడం గమనార్హం.వాస్తవానికి జన గణన 2020లో ప్రారంభమై 2021 నాటికి పూర్తి కావాలి. కానీ 2020 ఫిబ్రవరి నుంచి 2022 వరకూ కరోనా మహమ్మారి మూడు విడతలుగా దేశ వ్యాప్తంగా ప్రబలింది. దీంతో జన గణనను అప్పట్లో కేంద్రం వాయిదా వేసింది. అంతలోనే 2024 సార్వత్రిక ఎన్నికలు ముంచుకు రావడంతో ఆ అంశం మరుగున పడింది.

### వైసీపీ రాష్ట్ర కల్చరల్ వింగ్ సెక్రెటరీగా

# కటకం జయరామయ్య నియామకం

**నాయుడుపేట- సూర్య వాస్తవం :** నాయుడుపేట పట్టణానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కటకం జయరామయ్యకు పార్టీలో అందలం లభించింది. వైసీపీ రాష్ట్ర కల్చరల్ వింగ్ సెక్రెటరీగా కటకం జయరామయ్యను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. తనపై నమ్మకం ఉంచి వైసీపీ రాష్ట్ర కల్చరల్ వింగ్ సెక్రెటరీగా నియమించిన మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డితో పాటు సూళ్లూరుపేట మాజీ శాసనసభ్యులు, పార్టీ సమన్వయకర్త కిలివేటి సంజీవయ్య, పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక. తదితరులు పాల్గొన్నారు.



# ఆత్మహత్య కాదు హత్యే : డీఎస్పీ

## - మొగుడే కాలయముడు

**హిందూపురం-సూర్య వాస్తవం, జూన్ 17**

లేపాక్షి మండలం నాగానపల్లికి చెందిన సవిత ఈనెల 4న ఆత్మహత్య చేసుకుందని భర్త పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతనిపై అనుమానం వచ్చిన పోలీసులు లోతుగా విచారణ చేపడితే భర్తే హత్యచేసినట్లు నిరూపణ అయిందని డీఎస్పీ మహేష్ తెలిపారు. ఈ కేసు వివరాలను మంగళవారం విలేకరులకు వెల్లడించారు. వివరాల్లోకెళితే లేపాక్షి మండలం నాగానపల్లికి చెందిన ఆదినారాయణప్ప భార్య సవిత ఈనెల 4న రాత్రి పదిగంటల సమయంలో ఇంటిపక్కనే ఉన్న గొర్రెల షెడ్డులో చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుందని భర్త అత్తమామలకు చెప్పాడు.

దీంతో భార్య పుట్టింటివారు పులుమతి నుంచి నాగానపల్లికి వెళ్లారు. అయితే అప్పటికే కొన ఊపిరితో ఉందని 108కు సమాచారం ఇచ్చారు. ఎంతసేపటికీ రాకపోవడంతో వేరే వాహనంలో ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. దీనిపై మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. అయితే పోలీసులకు ఆమె మృతిపై అనుమానం వచ్చింది విచారణ చేపట్టారు.

దీంతోపాటు పోస్టుమార్టం నివేదిక ఆధారంగా భర్తను అదుపులోకి తీసుకుని సీఐలు జనార్దన్, ఆంజనేయులు తమదైన శైలిలో విచారణ చేపట్టగా తానే హత్యచేసినట్లు



ఒప్పుకున్నాడన్నారు. భార్య వేరే వ్యక్తితో చనువుగా ఉందని అనుమానించిన భర్త ఈనెల 4న రాత్రి 10గంటల సమయంలో వెనుకవైపు నుండి వెళ్లి భార్య మెడకు చీరతో బిగించాడు. దీంతో ఆమె స్పృహతప్పి పడిపోయింది. అయితే ఆ చీర రేకుల షెడ్డు పైకప్పుకు కట్టి భార్య బంధువులకు ఆత్మహత్య చేసుకుందని సమాచారం ఇచ్చాడు. వారు వచ్చి చూసి నిజమేననుకున్నారు. అయితే ఆ చీర ఎక్కడా గడి వేసినట్లుగాని మెడ బిగిసిపోయినట్లుకానీ లేకపోవడంతో పోలీసులు తమదైన శైలిలో విచారించారు. అంతేకాక అనుమానం రాకుండా చీరను కత్తిరించారు. భర్తే హంతకుడని పోలీసులు నిర్ధారిం చారన్నారు. నిందితున్ని అరెస్టుచేసి కోర్టులో హాజరుపరిచినట్లు డీఎస్పీ తెలిపారు.

# అంగన్వాడీల్లోనే అక్షరాలు దిద్దిద్దాం

## - కళ్యాణదుర్గం ఎమ్మెల్యే సురేంద్రబాబు

**కళ్యాణదుర్గం - సూర్య వాస్తవం, జూన్ 17:**

మూడు సంవత్స రాలు నిండిన చిన్నారులను అంగన్వాడీ కేంద్రాల్లోనే చేర్పించి, వారితో అక్షరాలు దిద్దించడం ద్వారా వారి వికాసానికి తల్లిదండ్రులు చొరవ చూపాలని కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పిలుపునిచ్చారు. కళ్యాణదుర్గం మండలం దురదకుంట గ్రామంలో ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆ తరువాత అంగన్వాడీ కేంద్రంలో సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమంలో భాగంగా చిన్నారులతో అక్షరాలు దిద్దించారు. ఒత్తిడి లేని విద్య అంగన్వాడీ కేంద్రాలతో పాటు ప్రభుత్వ విద్యా సంస్థల్లోనే సాధ్యమని ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వం కూడా కోట్లాది రూపాయల బడ్జెట్ తో విద్యా రంగంలో అనేక మార్పులు తీసుకువస్తుందని వివరించారు. మూడేళ్లు నిండిన పిల్లలందరినీ అంగన్వాడీల్లో చేర్పించి,



వారికి ఆటపాటల విద్య అందిద్దామని కోరారు. తరగతి గదిలోనే పిల్లల భవిష్యత్ తయారవుతుందని పేర్కొన్నారు. ఆరేళ్లు నిండిన పిల్లలను ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. పిల్లలకు చదువుతో పాటు ఆటపాటలు ఎంత ముఖ్యమో మంచి పౌష్టికాహారం కూడా అంతే ముఖ్యమన్నారు. పోషక విలువలతో కూడిన ఆహారం అంగన్వాడీల్లో లభిస్తుందని వెల్లడించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అవసరమైన పౌష్టికాహారం అంగన్వాడీల్లో లభిస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సీడీపీఓ లక్ష్మీ ప్రసన్న కోరారు. అనంతరం ప్రభుత్వం సరఫరా చేసిన ఇండెక్స్ స్లేటలను అంగన్వాడీ కార్యకర్తలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు, అంగన్వాడీ వర్కర్లు, ఆయాలు, చిన్నారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ప్రతి గడపకు వెళ్దాం... వైకాపా అసత్య ప్రచారం తిప్పికొడతాం

## - ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు

## - అభివృద్ధి ఓర్వలేక అపనిందలా? : ప్రభుత్వ విప్ కాలువ



**రాయదుర్గం టౌన్ - సూర్య వాస్తవం :** ప్రతి గడపకు వెళ్లి తల్లికి వందనంపై వైకాపా చేస్తున్న అసత్య ప్రచారాన్ని తిప్పికొట్టాలని టిడిపి శ్రేణులకు ప్రభుత్వ విప్, శాసనసభ్యులు కాలవ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. "తల్లికి వందనం" కార్యక్రమం ద్వారా నిరుపేద పిల్లల చదువులకు ప్రభుత్వము ఆర్థిక భరోసా ఇస్తోందని రాయదుర్గం ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు అన్నారు. ఆర్.అండ్.బి అతిథి గృహంలో మంగళవారం విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు మాట్లాడుతూ...ఈ బృహత్తరమైన పథకంతో లక్షలాది మందికి నిరుపేద విద్యార్థులకు లబ్ధి చేకూరుతుందన్నారు. రాష్ట్ర మంత్రి నారా లోకేష్ బాబు చలవతో ఆర్థిక సాయం అందుతుండటం పట్ల ఆనందం వెల్ల విరుస్తుంద న్నారు. ఈ పథకం "నా భూతో నా భవిషత్" అని ఆనందం వ్యక్తపరిచారు. లబ్దిదారులు స్వచ్ఛందంగా తరలి వచ్చి ఆనందం వ్యక్తపరుస్తున్నారన్నారు. ఐతే వైకాపా మాత్రం అసత్య దుష్ప్రచారం చేస్తూ... సాక్షి పేపర్, సాక్షి మీడియాలో ఆపద్దలు వల్లివేస్తోందని ఎమ్మెల్యే కాలువ ఆగ్రహం వ్యక్తపరిచారు. తప్పుడు ప్రచారంతో నానాయాగి చేస్తూ వివాదాస్పదం చేయాలనే వైకాపా ప్రయత్నాన్ని తిప్పికొట్టాలని, ఆయన సూచించారు. ప్రతి గ్రామంలో ప్రతి ఇంటింటికీ వెళ్లి లబ్దిదారుల సంతోషంలో మేము పాల్గొని పాలు పంచుకొంటామని తెలిపారు. ప్రజలు మెచ్చిన పథకాన్ని వీలైతే అభినందించాలని లేదా మౌనంగా ఉండాలని పేర్కొన్నారు. జగన్ పాలనలో ఆగిపోయిన అభివృద్ధి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వంలో తిరిగి ప్రారంభమైందని తెలిపారు. కేంద్ర ప్రాయోజిత కార్యక్రమాలను ఆపివేయగా 68 కార్యక్రమాలను తిరిగి ప్రారంభించినట్లు వివరించారు. "అమ్మ ఒడి" పేరుతో ఒక్కొక్కరికి రూ.15వేలు ఇస్తానన్న హామీని జగన్ నీరుగార్చారని ధ్వజమెత్తారు. ఇలాంటి నయవంచకుడు అతని పార్టీ, మీడియా వండివార్చే ఆపద్దాలు నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# 'జగన్ అంటే నమ్మకం... చంద్రబాబు అంటే మోసం.. పుస్తకావిష్కరణ



**పత్తికొండ టౌన్ - సూర్య వాస్తవం, జూన్ 17 :** పత్తికొండ మండలం నందు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆఫీసులో జగన్ అంటే నమ్మకం చంద్రబాబు అంటే మోసం అనే పుస్తకాన్ని ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమానికి వైఎస్ ఆర్సిపి మండల కన్వీనర్ కారం నాగ రాజ్ యాదవ్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కూటమి ప్రభుత్వం సంవత్సరంలో దాదాపు ఇచ్చిన హామీలు నెరవేరుస్తానని ఎన్నికల ముందు చెప్పడం జరిగింది కానీ ఒక సంవత్సరం కాలం పూర్తయినప్పటికీ ఇచ్చిన హామీలు నెరవేర్చలేదు 50 సంవత్సరాలకు ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ పెన్షన్ ఇస్తారని ఇవ్వలేదు నిరుద్యోగ భృతి ఇస్తానని ఇవ్వలేదు ఉచిత బస్సు అని ఇవ్వలేదు అన్నదాత సుఖీభవ20 లక్షల ఉద్యోగాలు ఇస్తానని మాట ఇచ్చి మోసం చేశాడని తెలిపారు రాష్ట్ర. అధికార ప్రతినిధి శ్రీరంగడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మొదటి సంవత్సరంలో ఒక హామీ తప్ప ఏమి నెరవేర్చలేదని తెలిపాడు కూటమి ప్రభుత్వం సంవత్సరంలో అరా చకాలు అత్యాచారాలు తప్ప ఏమి చేయలేదని అన్నారు ఈ కార్యక్రమంలో ఎంపీపీ నారా యణదాసు శ్రీరంగడు భాస్కర్ నాయక్ సర్పంచ్లు రెహమాన్ ఆంజనేయ రంగనాయక్ నాగరాజు తిప్పయ్య ఎంపీటీసీ కృష్ణారెడ్డి గణపతి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు టీఎండీ హుసేన్ జయచంద్రారెడ్డి నరసింహులు శ్రీని వాసులు రవి రెడ్డి రవికుమార్ మోహన్ కుమార్ బాలు దొరస్వామి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయునికి సన్మానం




**పత్తికొండ టౌన్ - సూర్య వాస్తవం, జూన్ 17**

పత్తికొండ మండలంలోని పందికోన గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 22 మంది విద్యార్థులను గురుకుల పాఠశాలకు ఎంపికైన సందర్భంలో వారికి శిక్షణ ఇచ్చి వారి విద్యాభివృద్ధికి తోడ్పడినటువంటి ఉపాధ్యాయులు నాగరాజ్ ని విద్యార్థులు మరియు తల్లిదండ్రులు సన్మానించడం జరిగింది ఈ కార్యక్రమంలో పత్తికొండ సిఐ ఏ జయన్న ఎంఈఓ రమేష్ ,ఎంపీపీ స్కూల్ హెడ్మాస్టర్ సుధాకర్, వెంకటేష్ రెడ్డి, మాజీ హెడ్మాస్టర్ కుంపటి నారాయణ, హై స్కూల్ హెడ్మాస్టర్ ఖాదర్, మరియు పందికోన సర్పంచ్ మంజుల, ఎంపీటీసీ నాగవేణి గ్రామ పెద్దలు చెన్నమనాయుడు, మల్లికార్జున్, బుల్లేని పక్కిరప్ప, తల్లిదండ్రులు రవి, శేఖర్,గిరి,రంగడు,కుమార్ నాయుడు,జయరాముడు, దేవేంద్ర ఈ కార్యక్రమానికి ఆర్గనైజర్ పెద్దయ్య గ్రామ ప్రజలు పాల్గొని విజయవంతం చేశారు

# కంటే కూతుర్నే కనాలి

# ఓ కూతురి కథ

**తండ్రికి జరిగిన అన్యాయం కోసం ఆరు నెలల కూతురు 32 ఏళ్ళు పోరాటం చేసి దోషులకు ఎలా శిక్ష వేసిందో తెలుసా.. కష్టపడి చదివి యూనివర్సిటీలో గోల్డ్ మెడల్ సాధించింది డిగ్రీ పూర్తి చేసింది. సివిల్స్ కి ప్రిపేర్ అయ్యి దేశంలోనే 25వ ర్యాంకును సాధించింది కలెక్టర్ అయ్యింది. తన తండ్రిని చంపిన కేసును సిబిఐ అధికారులతో మాట్లాడి కేసు కావలసిన సాక్ష్యాలను సంపాదించి. కోర్టుకు సమర్పించి ముగ్గురు పోలీసులకు మరణశిక్ష. ఐదుగురికి జీవిత ఖైదు శిక్ష విధించేలా చేసి. అందుకే కంటే కూతుర్నే కనాలి అని పెద్దల మాట నిరూపించింది.**

**నాయుడుపేట-సూర్య వాస్తవం**

డీఎస్పీ స్థాయిలో ఉన్న తండ్రిని తోటి పోలీసులే చంపేస్తే తండ్రికి జరిగిన అన్యాయం కోసం ఆరు నెలల కూతురు 32 ఏళ్ళు పోరాటం చేసి దోషులకు ఎలా శిక్ష వేసిందో తెలుసా..

ఈమె పేరు కింజల్ సింగ్ ఈమెకు ఆరు నెలలు వయసున్నప్పుడు ఆమె తల్లి రెండో బిడ్డకు జన్మనిచ్చింది. ఆ టైంలో కరుడుగట్టిన క్రిమినల్స్ ఒక గ్రామంలో ఉన్నారని చెప్పి ఈమె తండ్రిని అక్కడికి రప్పించి తోటి పోలీసులే నకిలీ ఎన్కౌంటర్లో కాల్చి చంపి అతనితోపాటు 12 మంది గ్రామస్తులను చంపేశారు. ఈమె తల్లి వీవాదేవి ఇది నకిలీ ఎన్కౌంటర్ అని చెప్పి కోర్టు చుట్టూ తిరిగి తిరిగి తన భర్తకు జరిగిన అన్యాయం గురించి పోరాడుతూ.. కింజల్ సింగ్ డిగ్రీ చదువుతున్నప్పుడు ఆమె తల్లి కూడా క్యాన్సర్ తో మరణించింది. పుట్టెడు దుఃఖాన్ని దిగమింగుకొని కష్టపడి చదివి యూనివర్సిటీలో గోల్డ్ మెడల్ సాధించింది డిగ్రీ పూర్తి చేసింది కింజల్. తన చెల్లి ప్రాజల్ సింగ్ తో కలిసి ఒక రూమ్ తీసుకుని సివిల్స్ కి ప్రిపేర్ అయ్యి దేశంలోనే 25వ ర్యాంకును సాధించింది. కలెక్టర్ అయ్యాక తనకున్న పలుకుబడిన వాడి గ్రామస్తులతో సిబిఐ అధికారులతో మాట్లాడి కేసు కావలసిన సాక్ష్యాలను సంపాదించి కోర్టుకు



సమర్పించి ముగ్గురు పోలీసులకు మరణశిక్ష మరో ఐదుగురికి జీవిత ఖైదు శిక్ష విధించేలా చేసి కంటే కూతుర్నే కనాలి అని నిరూపించింది.



# అలిగి ఇంట్లో నుంచి వెళ్లిపోయిన బాలిక

## - గంటలోనే ఆచూకీ కనిపెట్టిన 4వ పట్టణ పోలీసులు

**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, జూన్ 17:** అనంతపురం పట్టణంలోని స్థానిక అజయ్ ఘోష్ కాలనీ కి చెందిన బొమ్మలాట మోక్షిత (12) మంగళవారం నాడు తనకు ఇష్టం లేదా హాస్టల్ పంపుతున్నారని తల్లిదండ్రులపై బాలిక అలిగి ఇంటి నుండి పారి పోయింది. దీంతో బాలిక తల్లిదండ్రులు నాలుగవ పట్టణ పోలీసులను ఆశ్రయించారు. నాలుగవ పట్టణ సీఏ జగదీష్ వెంటనే స్పందించి రెండు ప్రత్యేక బృందాలను రంగంలో దింపి గాలింపు చర్యలు చేపట్టారు. సీసీ కెమెరాలు ఆధారంగా నందమూరి నగర్ లో ఉన్న చిన్నారి ఆచూకీ కనుగొని గంటలో చేధించారు. ఆ బాలికను తల్లిదండ్రులకి అప్పగించి అందరి ప్రశంసలు అందుకున్నారు.

## బూత్ లెవెల్ ఏజెంట్ల జాబితాను ఇవ్వండి

### - కలెక్టర్ టీఎస్ చేతన్



**శ్రీ సత్య సాయి బ్యూరో (సూర్య వాస్తవం) జూన్,17:** అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించి జాబితాను త్వరగా ఇవ్వాలని కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు.మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ అధ్యక్షతన సమావేశం జరిగింది.ఈ సందర్భంగా కలెక్టర్ టీఎస్ చేతన్ మాట్లాడుతూ ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు వెంటనే బూత్ లెవెల్ ఏజెంట్లను గుర్తించి, జాబితాను ఇవ్వాలని అన్నారు. ముఖ్యంగా నియమ నిబంధనలను కచ్చితంగా పాటించాలని అన్నారు. బూత్ లెవెల్ ఆఫీసర్లు సంబంధిత బూత్ లో ఓటు హక్కు కలిగి ఉండి, ప్రభుత్వ ఉద్యోగిగా ఉండాలన్నారు. బూత్ లెవెల్ ఏజెంట్లు కూడా సంబంధిత బూత్ లో ఓటు హక్కు కలిగి ఉండాలని సూచించారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఇంకా ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొని రావాలని కలెక్టర్ అన్నారు.ఈ సమావేశంలో డిఆర్ఓ విజయ సారథి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళపై జరిగిన దారుణ దాడి ఘటనపై స్పందించిన మంత్రి



**రాయచోటి-సూర్యవాస్తవం, జూన్ 17:**కుప్పం మండలం నారాయణపురం గ్రామంలో మహిళపై జరిగిన దారుణ దాడి ఘటనపై జిల్లా ఇంచార్జి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. ఒక మహిళను చెట్టుకు కట్టేసి హింసించడం వంటి అమానుష చర్యలు ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని మంగళవారం విడుదల చేసిన ఒక ప్రోగ్రాం లో ఆయన స్పష్టంగా చేశారు. బాధితురాలి కుటుంబానికి న్యాయం జరుగేలా చూస్తాము, నిందితుడిని ఇప్పటికే అరెస్ట్ చేయడం జరిగింది తెలిపారు.ఘటనపై జిల్లా ఎస్పీతో ఫోన్ మాట్లాడిన మంత్రి రాంప్రసాద్ రెడ్డి ఇలాంటి ఘటనలు మళ్లీ, మళ్లీ జరగకుండా పోలీసు యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.మహిళల భద్రత మా ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని అన్నారు.జిల్లా అధికారులు, పోలీసు విభాగం వెంటనే బాధిత కుటుంబాన్ని పరామర్శించి, వారికి అండగా ఉండాలని, అవసరమైన సహాయక చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆదేశించారు.

## పురుగుమందు తాగి మహిళ ఆత్మహత్య

### మృతికి కుటుంబ కలహాలే కారణమంటున్న పోలీసులు



**మదనపల్లె - సూర్యవాస్తవం, జూన్ 17:** కుటుంబ కలహాలతో పురుగు మందు తాగి మహిళ ఆత్మ హత్య చేసుకుంది. తీవ్ర కలకలం రేపిన ఘటనకు సంబంధించి మృతుని కుటుంబీకులు, పోలీసుల కథనం.. అన్నమయ్య జిల్లా, మదనపల్లె నియోజకవర్గం, రామసముద్రం మండలం, కాప్పల్లికి చెందిన సంతోష్ భార్య కె.అహల్య(27) మంగళవారం కుటుంబ కలహాలతో మనస్థాపానికి గురైంది. టమాటా చెట్లకు కొట్టడానికి తెచ్చి ఇంట్లో ఉంచిన పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వెంటనే ఆమెను మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించగా, సికిత్స పొందుతూ మృతి చెందింది. కేసు దర్యాప్తులో ఉంది.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ:- ఎమ్మెల్యే సునీత

**రాప్తాడు-సూర్యవాస్తవం,జూన్ 17:** రాప్తాడు నియోజకవర్గంలోని ఆత్మకూరు,అనంతపురం రూరల్,రాప్తాడు మండలాలకు చెందిన పలువురికి ఎమ్మెల్యే పరిటాల సునీత సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. అనంతపురంలోని టిడిపి క్యాంప్ కార్యాలయంలో 10 మంది లబ్దిదారులకు రూ.10,85,000 విలువైన చెక్కులను అందజేశారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ఎమ్మెల్యే సునీతకు,ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.ఈ సంధర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ పేదవాళ్ల అనారోగ్యానికి గురైతే ముఖ్యమంత్రి చంద్రబాబు అండగా నిలుస్తున్నారన్నారు. ఆరోగ్యశ్రీ వర్తించని వారికి కూడా సీఎంఆర్ఎఫ్ ద్వారా సహాయం అందిస్తున్నామన్నారు.



# టెన్త్ టాపర్‌కు బాల్య వివాహ యత్నం..?

- శింగనమల మండలంలో ఘటన
- బాలిక కుటుంబ సభ్యులతో ఆరా తీసిన ఉపాధ్యాయులు
- లేదు..లేదంటూ బుకాయింపు
- ఐసీడీఎస్ అధికారులకు తెలిపినా స్పందించని వైనం
- తక్షణం ఐసీడీఎస్, ఐసీపీఎస్, చైల్డ్ లైన్, పోలీసులు రంగంలోకి దిగేరా?
- కలెక్టర్ సాబ్..జరా దేఖో సాబ్



**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, జూన్ 17:** అనంతపురం జిల్లా శింగనమల మండలంలో టెన్త్ టాపర్ కు బాల్య వివాహం చేసేందుకు జరుగుతున్న యత్నాలు వెలుగు చూసాయి.నార్పల మండలం బండమీదపల్లి ఉన్నత పాఠశాలలో గత ఏడాది పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థిని ఇటీవల విడుదలైన ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. అయితే కుటుంబ సభ్యులు పై చదువులు చదివించకుండా మేనమామతో పెళ్లి చేసేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేయడం సంచలనంగా మారింది.ఈ విషయం ఉపాధ్యాయుల చెవిన పడటంతో బాలిక ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను ఆరా తీసినట్లు జిల్లా కేంద్రానికి సమాచారం అందింది.పదో తరగతి చదువుతుండగానే మేనమామతో పెళ్లి చేయాలని కుటుంబ సభ్యులు ప్రయత్నించగా అప్పట్లోనూ ఉపాధ్యాయులు అడ్డు కున్నట్లు తెలుస్తోంది.మంచి మార్కులతో పాసైన విద్యార్థినిని ఏ కాలేజీలోనూ చేర్చకపోవడంతో అనుమానం వచ్చిన ఉపాధ్యాయులు.. మరోసారి ఆరా తీయడంతో అసలు విషయం తెలిసి విస్తుపోయారు.పెళ్లి చేసి బిడ్డ జీవితం నాశనం చెయ్యొద్దని కుటుంబ సభ్యులకు ఉపాధ్యాయులు కోరినట్లు తెలుస్తోంది. అయితే అటువంటి ప్రయత్నాలు చేయలేదని కుటుంబ సభ్యులు బుకాయించినా.. ఇప్పటికే నిశ్చితార్థ ప్రక్రియ పూర్తయిందని, మంచి రోజు చూసి పెళ్లి తంతు ముగించడమే మిగిలి ఉందని జిల్లా కేంద్రానికి సమాచారం అందింది.దీనిపై ఐసీడీఎస్, అధికారులకు ఫోన్‌లో సమాచారం ఇచ్చినా స్పందించలేదని ఆరోపించారు. తక్షణం ఐసీడీఎస్, ఐసీపీఎస్, చైల్డ్ లైన్, పోలీస్ అధికారులు తక్షణం స్పందించి రంగంలోకి దిగాలి.

## వణ్య ప్రాణులను వేటాడిన నిందితులు అరెస్ట్



**మదనపల్లె - సూర్యవాస్తవం, జూన్ 17:** అడవి పందులను వేటాడే ఇద్దరిని అటవీ శాఖ అధికారులు అరెస్ట్ చేశారు. మదనపల్లె ఎఫ్ఆర్ఓ జయప్రసాద్ రావు, ములకళచెరువు సెక్షన్ ఆఫీసర్ ముబీన్ తాజ్ లు సోమవారం రాత్రి తెలిపిన వివరాల మేరకు. అన్నమయ్య జిల్లా, తంబళ్లపల్లె నియోజకవర్గం, ములకళచెరువు మండలం పరిధిలోని బురకాయల కోట, వేపూరి కోట, నేరేడికొండ బీట్లలో వన్య ప్రాణులను రోజూ వేటాడి, మాంసం తరలిస్తున్నట్లు సెక్షన్ ఆఫీసర్ ముబీన్ తాజ్ కు పక్కా సమాచారం అందింది అన్నారు. ఈ మేరకు ఆమె సిబ్బందితో వెళ్లి ములకళచెరువు మండలం, ఒడ్డిపల్లి సమీపంలోని వ్యవసాయ పొలాల్లో సత్యసాయి జిల్లా, కదిరి వీరాస్ కాలనీకి చెందిన బి. రమేష్ కొడుకు బాలాజీ(23), ములక ళచెరువు రామాపురం కు చెందిన డి.చిన్న నాగన్న కొడుకు మంజునాథ(30) లను పట్టుని, మాంసం, మారణాయుధాలు సీజ్ చేసిందని ఎఫ్ఆర్ఓ తెలిపారు. అనంతరం నిందితులపై 1972 వణ్య ప్రాణుల చట్టం ప్రకారం తీవ్రమైన నేరంగా భావించి, కేసు నమోదు అనంతరం అరెస్టు చేశామని తెలిపారు.

## యోగా గురువుల ద్వారా యోగాంధ్ర శిక్షణలు

### - విద్యార్థులకు, విశ్రాంత ఉద్యోగులకుయోగాంధ్ర శిక్షణలు నిర్వహించిన మున్సిపల్ కమీషనర్ జబ్బార్ మియా






**గుత్తి -సూర్యవాస్తవం, జూన్ 17:**గుత్తి పట్టణంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టా త్మకంగా నిర్వహించ బోతున్న మెగా ప్రపంచ యోగా దినోత్సవం జూన్ 21లో భాగంగా స్థానిక పెన్ష నర్ల భవన్‌లో విశ్రాంత ఉ ద్యోగులకు , శ్రీరామనుజ న్ హై స్కూల్‌లో విద్యార్థులకు యోగా గురువులు మాస్టర్ ట్రైనర్లు కృష్ణయ్య , రామకృష్ణ యోగాంధ్ర శిక్షణలు నిర్వ హించడమైనదని మునిసిపల్ క మీషనర్ జబ్బార్ మియా తెలియజేశారు.ఈ సందర్భంగా కమీషనర్ యోగా ట్రైనర్లు ఆరోగ్య ప రమైన యోగాసనాలు తెలియజే శారు.ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘము అధ్యక్ష కా ర్యాదర్శులు జెన్నే కుల్లాయప్ప అబూబాకర్, ఇతర సహచర సిబ్బంది,శ్రీరామనజున్ స్కూ ల్ ఉపాధ్యాయ సిబ్బంది స్కూల్ సిబ్బంది,మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

### - వైఎస్ఆర్సీపీ సీనియర్ నాయకుడు క్రిష్ణారెడ్డి



**సిద్దవటం -జూన్ 17 (సూర్యవాస్తవం):** మామిడి రైతులు తీవ్రంగా నష్ట పోయారని మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని వైఎస్ఆర్సీపీ సీనియర్ నాయకుడు మాజీ సర్పంచ్ టక్కోలు క్రిష్ణారెడ్డి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ మామిడి కాయలు చెట్లకే మాగి పురుగుల పడుతున్నాయన్నారు. ధరలు పతనం కావడంతో మామిడినే నమ్ముకున్న రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా మారిందన్నారు. గత ఏడాది ఎకరాకు రూ.50 వేలు వచ్చిందని, ఈఏడాది ఎకరాకు రూ. 10 వేలు కూడా రాలేదని రైతులు వాపోయారు. బేనీషా రకానికి చెందిన పండ్లు కిలో 30 రూపాయలకే అడుగుతున్నారన్నారు. మామిడి కాయ పక్వానికి వచ్చి మాగిపోయి పురుగులు పడుతున్నాయన్నారు. మామిడిని నమ్ముకున్న రైతులు తోటలోనే కుల్లి పోతున్న కాయలను చూసి రైతులు కుమిలి పోతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రైతు సంక్షేమం పై శ్రద్ధ చూపలేదన్నారు. మామిడి రైతులకు గిట్టు బాటు ధరలేక పెట్టిన పెట్టు బడులురాక చేసిన అప్పులు ఎలా తీర్చాలో దిక్కు తెలియని స్థితిలో రైతులు ఉన్నారని ఆయన పేర్కొన్నారు.

## ఈ నెల 19న హార్సిలీ హిల్స్‌లో యోగాంధ్రని ఘనంగా నిర్వహించాలి

### - జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి






**అన్నమయ్య బ్యూరో-సూర్యవాస్తవం, జూన్ 17:** ఈనెల 19న హార్సిలీ హిల్స్లో యోగాంధ్ర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామ కూరి అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాల్లో వివిధ శాఖల జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఈనెల 19న హార్సిలీ హిల్స్లో వెయ్యి మందితో నిర్వహించబోయే యోగాంధ్ర కార్యక్రమంపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... అన్నమయ్య జిల్లాలో ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్స్లీ హిల్స్‌లో యోగాంధ్ర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని, దీనికి సంబంధించిన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేసుకోవాలన్నారు. యోగాంధ్ర కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా వివిధ పర్యాటక కేంద్రాలలో నిర్వహిస్తున్న సందర్భంగా ఈ నెల 19న హార్సిలీ హిల్స్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈకార్యక్రమం విజయవంతమయ్యేలా చూసు కోవాలని జిల్లా పర్యాటకశాఖ అధికారి నాగభూషణంను ప్రత్యేకంగా ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, జిల్లా పర్యాటక శాఖ అధికారి నాగభూషణం, పిడి డి ఆర్ డి ఏ సత్యనారాయణ, జి ఎస్ డబ్ల్యూ ఎస్ శాఖ అధికారి లక్ష్మీపతి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )